



జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సంపత్‌కుమార్

100 నగరాభివృద్ధికి రోజుల ప్రణాళిక

విశాఖను దేశంలోనే ముందువరుసలో నిలిపేందుకు కృషిచేస్తా

- సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తా
- సిబ్బంది, అధికారుల్లో క్రమశిక్షణ పెంపునకు ప్రాధాన్యం
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మరింత మెరుగైన ర్యాంకు సాధనకు యత్నం
- జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి):

విశాఖ నగరాభివృద్ధికి వంద రోజులు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తానని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. కమిషనర్‌గా మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కమిషనర్‌గా తన ప్రాధాన్యాలను వివరించారు.

జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేయడాన్ని ఐఏఎస్ అధికారులు తమ కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తారన్నారు. అంత చక్కటి అవకాశం తనకు కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీగా గతంలో పనిచేసిన తనకు జీవీఎంసీపై కొంత అవగాహన ఉందని సంపత్‌కుమార్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీకి మంచి ర్యాంకు దక్కే అర్హత ఉన్నప్పటికీ కాపులుప్పాడ డంపింగ్ యార్డులో వ్యర్థాలు (లెగసీ వేస్ట్) ఎక్కువగా ఉండిపోవడం అవరోధంగా మారుతోందన్నారు. దీనిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు మధ్య వారధిగా ఉంటూ నగరంలో సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. జీవీఎంసీ సిబ్బంది, అధికారుల్లో క్రమశిక్షణ పెంచడానికి ప్రాధాన్యమిస్తానన్నారు. విధి నిర్వహణపైనే దృష్టిపెట్టేలా సిబ్బంది ప్రవర్తనలో మార్పు తేవాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రమైన, అందమైన నగరంగా గుర్తింపు కలిగిన విశాఖను దేశంలోనే ముందువరుసలో నిలిపేందుకు ప్రయత్నిస్తానన్నారు. నగరంలో సమస్యలపై అవగాహన పెంచుకుని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. నగరంలో వివిధ దశల్లో ఉన్న ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళతానన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది తమ సమస్యలపై తనను కలిసేందుకు నిర్దేశిత సమయం కేటాయిస్తానన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు, సీనియర్ అధికారులతో సమన్వయం చేసుకుని జీవీఎంసీని అభివృద్ధిపథంలో నడుపుతానన్నారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సంపత్‌కుమార్‌ను జీవీఎంసీ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌లను కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

అభివృద్ధికి ఊతం

ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి ప్రత్యేక సాయం

- కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా హర్షం



- మౌలిక వసతుల మెరుగుకు అవకాశం
- ముద్ర రుణాల పెంపు ద్వారా ఎంఎస్ ఎంఈలకు చేయూత
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ
- మహిళలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ
- పోలవరం పూర్తితో సాగు, తాగునీరు
- స్టీల్‌ప్లాంటుకు రూ.620 కోట్ల సాయం
- విశాఖ పోర్టుకు రూ.150 కోట్లు
- హెచ్‌పీసీఎల్‌కు రూ.50 కోట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కేంద్రం బడ్జెట్ విశాఖ జిల్లాకు కొంత వరకూ మేలు చేసేదిగా ఉంది. రాష్ట్ర పునర్విభజన చట్టంలో అమలు చేయకుండా వదిలేసిన వాటిని పూర్తిచేయడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం ఈసారి ప్రాధాన్యం ఇచ్చింది. ఉత్తరాంధ్రను వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి ప్రత్యేక సాయం చేస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు. గత ఐదేళ్లు ఈ సాయం అందలేదు. అంతకు ముందు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల నిధులు ఆగిపోయాయి. ఇప్పుడు వాటిని ఇవ్వనున్నారు. దీనివల్ల మౌలిక వసతులు మెరుగుపడడమే కాకుండా పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు లభిస్తాయి. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

ఎంఎస్ఎంఈలకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ముద్ర రుణాల కింద ఇప్పటి వరకూ ఇస్తున్న రూ.10 లక్షల రుణాన్ని రూ.20 లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. కొత్తగా ఉపాధి కల్పించే సంస్థలకు ఒక్కో ఉద్యోగికి నెల జీతం రాయితీ ఇస్తామని భరోసా కల్పించారు. దేశంలో వేయి పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఆధునీకరించి, పరిశ్రమలకు ఉపయోగపడేలా యువతకు శిక్షణ ఇస్తామని ప్రకటించారు. అందులో విశాఖ జిల్లాకు కూడా అవకాశం లభించనుంది. ఇక్కడి పరిశ్రమలకు అవసరమైన శిక్షణ ఇవ్వడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

మెడ్‌టెక్ జోన్‌కు ఊతం

ఆరోగ్య రంగంలో పరిశోధనలు, పరికరాల తయారీకి అవసరమైన వస్తువుల దిగుమతిపై సుంకం తగ్గించారు. ఎక్స్‌రే ప్యానల్స్, క్యాన్సర్ మందుల తయారీకి ప్రత్యేక మినహాయింపులు ఇచ్చారు. దీనివల్ల విశాఖపట్నంలోని మెడ్‌టెక్ జోన్‌కు ప్రయోజనం కలగనుంది.

డీఆర్‌డీఓకు భారీగా నిధులు

రక్షణ రంగానికి భారీగా నిధులు కేటాయించారు. అందులో డీఆర్‌డీఓ పరిశోధనలకు రూ.28వేల కోట్లు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. తూర్పు తీరాన రక్షణగా ఉన్న నౌకాదళానికి, ఎన్ఎస్‌టీఎల్‌కు ఇక్కడి డీఆర్‌డీఓ ... మిగతా 6వ పేజీలో

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్

- ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్



ఏపీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉంది. ఉత్తరాంధ్రకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడం వల్ల రానున్న రోజుల్లో యువతకు, భావితరాలకు ఎంతో మేలు చేకూరనుంది. ఈ బడ్జెట్ వల్ల విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలకు సంబంధించి అనేక ప్రాజెక్టులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు ఏర్పాటుకు ఆస్కారం ఏర్పడుతుంది. దీనివల్ల అభివృద్ధికి ఊతం లభిస్తుంది. రాజధాని ప్రాంత అభివృద్ధి కోసం కూడా బడ్జెట్‌లో విస్తృత కేటాయింపులు చేశారు. ఇది రాష్ట్ర ప్రజలకు మెరుగైన సౌకర్యాలను అందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామనడం బడ్జెట్‌లో ముఖ్యమైన అంశం. రాష్ట్రానికి మేలు చేకూర్చేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, ఆర్థిక శాఖా మంత్రి నిర్మాలా సీతారామన్‌కు కృత జ్ఞతలు. సీఎం నారా చంద్రబాబునాయుడు కృషి, పట్టుదలకు ఈ బడ్జెట్ తార్కాణంగా నిలుస్తుంది. ఢిల్లీలో ప్రతి కేంద్ర మంత్రితో మాట్లాడి రాష్ట్రానికి నిధులు వచ్చేలా అహర్నిశలూ చంద్రబాబునాయుడు కృషి చేశారు.

పదేళ్లలో రాష్ట్రానికి మేలు చేకూర్చిన ఏకైక బడ్జెట్ ఇదే

- ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్, ఏయూ



గడిచిన పదేళ్లలో రాష్ట్రానికి మేలు చేకూర్చిన ఏకైన బడ్జెట్ ఇదే. విభజన చట్టంలో పేర్కొన్న అనేక అంశాలకు సంబంధించి మేలు చేకూర్చేందుకు కేంద్రం సిద్ధమైనట్టుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటనతో స్పష్టమైంది. ఆర్థికంగా బిహార్ కంటే రాష్ట్రానికి ఎక్కువ లబ్ధిని చేకూర్చేలా అనేక అంశాలపై ప్రకటన చేశారు. ముఖ్యంగా రాజధానికి ఆర్థిక సాయం, ఉత్తరాంధ్రతోపాటు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు అందిస్తామని ప్రకటించడం హర్షనీయం. దీనివల్ల రాష్ట్రంలో పరిశ్రమలు పెరిగి, యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొత్తంగా చూస్తే బడ్జెట్ మెరుగ్గా ఉంది. వ్యవసాయానికి కూడా భారీగా కేటాయింపులు పెంచారు. మహిళలు ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమానికి భారీగా కేటాయింపులు చేయడం శుభపరిణామంగా చెప్పవచ్చు.

మౌలిక వసతుల ప్రాజెక్టులకు భారీగా నిధులు

- గ్రంధి రాజేశ్, చైర్మన్, సీఐఐ



కేంద్రం బడ్జెట్‌లో మౌలిక వసతుల ప్రాజెక్టులకు రూ.11.11 లక్షల కోట్లు కేటాయించింది. దీనివల్ల దేశం ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తుంది. ఏపీ పునర్నిర్మాణ చట్టం కింద ఇవ్వాల్సినవి కొన్ని ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉండిపోయాయి. గత బడ్జెట్లలో ఏమీ ఇవ్వలేదు. ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు పూర్తితో పాటు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు ఇస్తామని చెప్పడం సంతోషకరం. అలాగే ఎంఎస్ఎంఈలకు ముద్ర రుణాల పరిమితి పెంచడం వల్ల స్టార్టప్‌ల ఎకో సిస్టమ్ మెరుగుపడుతుంది.

ఆర్టీసీ ఆదాయానికి గండి

ఐదు రోజుల్లో రూ.కోటి మేర కోల్పోయిన సంస్థ

- 52 శాతానికి మించని ఆక్యుపెన్సీ రేషియో
- ఏజెన్సీ ప్రాంతాలకు నైట్ సర్వీసులు రద్దు
- దూరప్రాంత సర్వీసుల్లో కొన్ని క్యాన్సిల్



ద్వారకా బస్‌స్టేషన్, జూలై 23:

భారీవర్షాల కారణంగా ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండి పడింది. వాయుగుండం ప్రభావంతో గడిచిన ఐదు రోజులుగా జిల్లాలో భారీవర్షాలు కురిశాయి. ఎడతెరిపి లేని వర్షం కారణంగా ప్రయాణికుల సంఖ్య బాగా తగ్గిపోయింది. శుక్రవారం నుంచి మంగళవారం వరకూ ఐదు రోజులు సగటు ఆక్యుపెన్సీ రేషియో 52 శాతంగా నమోదయ్యింది. ఈనెల ఒకటి నుంచి 18వ తేదీ వరకు ఆక్యుపెన్సీ రేషియో 70 శాతంగా నమోదయ్యింది. తరువాత ఐదు రోజుల సగటు ఆక్యుపెన్సీ రేషియో 52 శాతానికి పడిపోయింది. దీంతో ఆదాయం గణనీయంగా పడిపోయింది. ఈనెల ఒకటో తేదీ నుంచి 18వ తేదీ వరకు రోజువారీ ఆదాయం సగటున రూ.98 లక్షలు వచ్చింది. గడచిన ఐదు రోజుల్లో ఆదాయం సగటున రూ.78 లక్షలు వచ్చింది. రోజుకు రూ.20 లక్షలు తగ్గింది. ఐదు రోజులకు కోటి రూపాయల ఆదాయం తగ్గిపోయింది.

ఏజెన్సీ ప్రాంతాలకు నైట్ సర్వీసులు రద్దు

భారీవర్షాల కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లమీదుగా నీరు ప్రవహించడం, చెట్లు, చెట్ల కొమ్మలు విరిగిపడడం, కొన్నిచోట్ల రోడ్లకు గండిపడడం జరిగింది. అనకాపల్లి జిల్లా వడ్డాది దగ్గర ఒక బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే సీలేరు, భద్రాచలం వెళ్లాల్సిన నైట్ సర్వీసులను రద్దు చేశారు. పగలు తిరిగే సర్వీసులు కూడా తక్కువ ఆక్యుపెన్సీతో నడిచాయని అధికారులు వెల్లడించారు.

ప్రయాణికులు రాక దూరప్రాంతాల సర్వీసులు రద్దు

భారీవర్షాల కారణంగా ప్రయాణికులు లేకపోవడంతో ఆర్టీసీ అధికారులు దూరప్రాంతాల సర్వీసుల్లో కొన్నింటిని రద్దు చేశారు. విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లే సర్వీసుల్లో ప్రతిరోజు ఒక్కో సర్వీసును రద్దు చేశారు. అలాగే విజయవాడ, కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలకు వెళ్లాల్సిన సర్వీసుల్లో రోజుకు రెండేసి చొప్పున రద్దు చేశారు. గడిచిన ఐదు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగింది. బుధవారం నుంచి అన్ని సర్వీసులు షెడ్యూల్ ప్రకారం నడుస్తాయని రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పలరాజు తెలిపారు.

బస్సులు సిద్ధం చేసుకుంటున్న ఆర్టీసీ

- మహిళలకు ఉచితంగా రవాణా సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు
- ప్రస్తుతం రోజుకు 72,500 మంది మహిళల ప్రయాణం
- ఉచితం అములోకి వస్తే మరో పది శాతం మేర పెరగవచ్చునని అధికారుల అంచనా

- వార్త 6వ పేజీలో



బాధ్యతలు స్వీకరిస్తున్న విశ్వనాథన్

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా విశ్వనాథన్ బాధ్యతల స్వీకారం

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి):

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మెట్రోపాలిటన్ కమిషనర్‌గా కేఎస్ విశ్వనాథన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, ఎస్ఈ బలరామరాజు, డీఎఫ్ఓ శాంతి స్వరూప్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ హరిప్రసాద్, సీయూపీ సంజయ్ రత్నకుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆ తరువాత ఆయన పరిపాలన విభాగం, అర్బన్ ఫారెస్ట్రీ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించి, విధి విధానాలు, ఎవరు ఏ బాధ్యతలు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

దిగుమతి సుంకాల తగ్గింపుతో రిటైల్‌కు డిమాండ్

- సీఐఐ బడ్జెట్ సమావేశంలో వక్తలు

- వార్త I పేజీలో

దర్జాగా భూ కబ్జా

- పెదగదిలి జంక్షన్‌లో గల ప్రభుత్వ బంజరు
- చాలా ఏళ్ల కిందట డెయిరీ ఫారానికి కేటాయింపు
- అందులో కొంతమేర స్థలంలో నిర్మాణాలు చేపట్టకుండా వదిలేసిన ఆ శాఖ అధికారులు
- ఇప్పుడు విలువ పెరగడంతో ఆక్రమణల పాలవుతున్న వైనం
- చోద్యంచూస్తున్న అధికారులు



ఆరిలోవ బీఆర్‌టీఎస్ రోడ్డుకి ఆనుకుని సర్వేనంబర్ 55లో ఉన్న ప్రభుత్వ భూమి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో కబ్జాదారులు చెలరేగిపోతున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమించేసుకుంటున్నారు. అధికారులను లోబరుచుకుని తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారు. కొంతకాలం తర్వాత వాటిని వేరొకరికి విక్రయించేసి సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా ఆరిలోవ పెదగదిలి జంక్షన్‌లో బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకుని డెయిరీ ఫారం ఆధీనంలో ఉన్న విలువైన ప్రభుత్వ బంజరు భూమిని కొంతమంది ఆక్రమించుకోవడం చర్చనీయాంశంగా మారింది.

పెదగదిలి జంక్షన్‌లో బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకుని సర్వేనంబర్ 55లో బంజరు భూమి ఉంది. చాలాకాలం కిందట ఆ భూమిని డెయిరీ ఫారానికి కేటాయించారు. డెయిరీ ఫారం అధికారులు కొంతభూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడం, ప్రహరీ గోడ నిర్మించకపోవడంతో ఖాళీగానే ఉండిపోయింది. దీంతో చాలావరకూ ఇప్పటికే ఆక్రమణలకు గురికాగా బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకుని సుమారు అరెకరా స్థలం ఖాళీగా ఉంది. ఆరిలోవలో నిర్మించిన రైతుబజార్‌కు ఎదురుగా ఈ స్థలం ఉండడంతో వాహనాల పార్కింగ్‌కు అనువుగా ఉంటుందని అధికారులు భావించారు. కానీ రైతుబజార్ ఇంతవరకూ ప్రారంభానికి నోచుకోకపోవడంతో బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ స్థలంపై స్థానికంగా పలుకుబడి కలిగిన కొంతమంది కన్నుపడింది. రూ.5 కోట్లకు పైగా విలువచేసే ఆ స్థలాన్ని చేజిక్కించుకునేందుకు పథకం ప్రకారం పావులు కదిపారు. మామూలుగా స్థలాన్ని ... మిగతా 6వ పేజీలో

ప్రైవేటు ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి

- ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉచితంగా సేవలు అందించాల్సిందే
- పరికరాల కొనుగోలు పేరుతో డబ్బులు తీసుకుంటే చర్యలు
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు
- ఇష్టానుసారం డబ్బులు వసూలు చేస్తే ఊరుకోం

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులతోపాటు ప్రైవేటు/కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందించే సేవలపై ప్రత్యేకంగా దృష్టిసారిసామని వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. 'ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించే వాటన్నింటికీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కో-ఆర్డినేటర్‌కు సూచించినట్టు తెలిపారు. ఇతర ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా ఇష్టానుసారంగా బిల్లులు వసూలుచేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. ప్రైవేటు ఆస్పత్రులు నుంచి ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రోగుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్న ఆస్పత్రులను గుర్తించి నోటీసులు జారీచేస్తామన్నారు. ఇప్పటికే కొన్ని ఆస్పత్రులను గుర్తించామని, వాటిని మరింత పర్యవేక్షించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పరికరాలు కొనుగోలు, ఇతర ఖర్చుల పేరుతో ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రులపై పర్యవేక్షణ బాధ్యతను ప్రత్యేకంగా అధికారులకు అప్పగిస్తామన్నారు.

జీసీసీ ఎండీగా కల్పనాకుమారి బాధ్యతల స్వీకారం

- ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని సిబ్బందికి పిలుపు



కల్పనా కుమారి

విశాఖపట్నం, జూలై 23: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కల్పనాకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు అధికారులు, సిబ్బంది సాదరంగా స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలియజేశారు. కల్పనాకుమారి బాధ్యతలు స్వీకరించిన వెంటనే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అరకు కాఫీ మార్కెటింగ్, తదితర అంశాలపై చర్చించారు. జీసీసీ ప్రధాన కార్యాలయం, క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ నిబద్ధతతో పనిచేయాలని, తద్వారా సంస్థ పురోభివృద్ధి చెందుతుందని, గిరిజనులకు మంచి జీవనోపాధి లభిస్తుందని అన్నారు. అనంతరం గిరిజన సహకార సంస్థలో విజిలెన్స్, ఫైనాన్స్, మార్కెటింగ్, రిటైల్ మార్కెటింగ్, కాఫీ, పరిపాలన, అకౌంట్స్, రవాణా విభాగాలను, అరబికా కాఫీషాపు, ట్రైఫెడ్ రిటైల్ అవుట్‌లెట్, పలు అమ్మకం కేంద్రాలను పరిశీలించారు. లాసన్స్‌బే కాలనీలోని జీసీసీకి సంబంధించిన ఖాళీ స్థలాన్ని పరిశీలించి తదుపరి కార్యాచరణకు అధికారులకు సూచనలిచ్చారు.

నమ్మకంగా పనిచేస్తున్నట్టు నటించి రూ.4 కోట్లు స్వాహా - వార్త I పేజీలో

ఘనంగా బీఎంఎస్ 70వ ఆవిర్భావ దినోత్సవం



మట్లాడుతున్న సంఘ నాయకుడు

మద్రిపాలెం, జూలై 23: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 70వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం 104 ఏరియాలోని ఎంఈఎస్ కార్యాలయంలో సంఘ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రొక్కం సురేష్ కు మార్, శరగడం రామ చంద్రశేఖర్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సహప్రాంత ప్రచారక్ ఇ. జనార్దనరావు పాల్గొని తొలుత పతాకా విష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఎంఎస్ గత 69 ఏళ్లలో ఏ రాజకీయ పార్టీలతో అనుబంధం లేదన్నారు. నిరంతరం కార్మికుల పక్షాన పోరాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. మహానగర్ సంఘ్ చాలక్ నారాయణరావు మాట్లాడుతూ కార్మికుల్లో జాతీయభావాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈకార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు మళ్ళ జగదీశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు, బ్రహ్మానందం, సత్యారావు, లాలం ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి లోవరెడ్డి, స్టీల్‌ప్లాంట్, డాక్‌యార్డ్, హెచ్ఎస్ఎల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖకు మొండిచేయి

▸ ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏఎస్ నాయుడు


ఏఎస్ నాయుడు

మద్రిపాలెం, జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా వ్యవస్థకు మొండిచేయి చూపిందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏఎస్ నాయుడు విమర్శించారు. బడ్జెట్‌లో 9 ప్రధానమైన అంశాల్లో విద్యావ్యవస్థలో చోటు లేకపోవడం చాలా నిరాశపరిచిందన్నారు. 3.07 శాతం మాత్రమే విద్యా కేటాయింపులు న్యాయన్నారు. వేతన జీవులకు ఆదాయ పన్ను రాయితీ కూడా నిరాశ జనకంగా ఉందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూలై 23: నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ తెలిపారు. అబిడ్‌నగర్, అక్కయ్యపాలెం, రామచంద్రానగర్, టిడ్కో కాలనీ, సంతోష్ కాలనీ, ఎంటీసీ పాలెం, పుట్ట బంగారమ్మ గుడి ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాత నగరానికి కొత్తరూపు

▸ కురుపాం మార్కెట్‌నుంచి విక్టోరియా విగ్రహం వరకు రోడ్డు విస్తరణ పూర్తి

జగదాంబ కూడలి, జూలై 23: వన్‌టౌన్ రోడ్డు విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నారు. ఇందులో భాగంగా కురుపాం మార్కెట్ నుంచి విక్టోరియా విగ్రహం వరకు పాత నగరం సరికొత్తరూపుతో దర్శనమిస్తుంది. గతంలో ఇరుకు రోడ్లతో జనాలు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం 60 అడుగుల రోడ్డు మేర విస్తరించడంతో సువిశాలంగా మారింది. ఇరువైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణంతో పాటు అందంగా తారు రోడ్డు వేశారు. కురుపాం మార్కెట్ బజార్ రోడ్డు నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ఈ రోడ్డు అందుబాటులోకి వచ్చింది. విక్టోరియా విగ్రహం పరిసరాల్లో పాడైన రహదారులను అభివృద్ధి చేశారు. ఇప్పటికే వాచ్‌హౌస్ నుంచి పూర్ణామార్కెట్ వరకు రోడ్డుఆధునీకరణ పనులు పూర్తయ్యాయి. పూర్ణా మార్కెట్ మెయిన్ రోడ్డు నుంచి రీడింగ్ రూం కొంతమేర కురుపాం మార్కెట్ వరకు విస్తరణ పనులు నత్తనడగా సాగుతున్నాయి. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప లువురు కోరుతున్నారు. జగదాంబ నుంచి పాతనగరం కనబడేలా వన్‌టౌన్ రహదారి నిర్మాణ పనులు రూపుదిద్దుకున్నాయి. కొత్తగా హైటవర్ విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేశారు. రాత్రి వేళ విద్యుత్ కాంతులతో ఈ మార్గం కొత్త వెలుగులతో కనిపిస్తోంది.


బీటీ రోడ్డు

బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం: సీపీఐ



రైల్వే స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

అల్లిపురం, జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ నాయకులు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం విశాఖరైల్వే స్టేషన్ ప్రధానద్వారం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ రూ. 47.65 లక్షల కోట్ల అంచనాతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు కేటాయించడం తగదన్నారు. విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయడంలేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఒక్క రుపాయి కేటాయింపు లేదని మండి పడ్డారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకుంటామని హామీలు ఇచ్చి మభ్యపెడుతోందన్నారు. రైల్వే జోన్ ఏర్పాటు ఎటువంటి నిధులు కేటాయింపులు ప్రకటించలేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రకటన చేయకపోవడం అన్యాయమన్నారు. ఆదాయపన్ను మినహాయింపులో పేద మధ్య తరగతి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసారని, కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్.కె రెహమాన్, పి. చంద్రశేఖర్, ఆర్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'కళ్లు' సినిమాకు ప్రేక్షకుల ఆదరణ మరవలేం

▸ దర్శకుడు రఘు స్పందన


మాట్లాడుతున్న దర్శకుడు ఎంవీ రఘు

సీతంపేట, జూలై 23: కళ్లు సినిమాకు ప్రేక్షకుల ఆదరణ మరువలేనిదని దర్శకుడు ఎం.వి. రఘు తెలిపారు. ఈ చిత్రం విడుదలై 35 ఏళ్లు పూర్తికావడంతో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఈ చిత్ర ప్రదర్శన, ఈ సినిమాలో నటించిన నటీనటులు, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు రఘు తన స్పందనను తెలియజేశారు. రచయిత, సినీ నటుడు గొల్లపూడి మారుతిరావు నాటికను కళ్లు సినిమాగా రూపొందించినట్టు చెప్పారు. ఈ సినిమాకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చక్కటి సంగీతం అందించారన్నారు. సిరివెన్నెల సీతారామ శాస్త్రి పాటలు హైలెట్‌గా నిలిచాయన్నారు. విశాఖలో ఎంతో మంది సహకారంతో ఈ సినిమా పూర్తి చేశామన్నారు. ఈసినిమా కమలహాసన్ నటించిన స్వాతిముత్యంతోపాటు విడుదలైందన్నా, తమ సినిమాను ప్రేక్షకులు ఎంతో ఆదరించారన్నారు. రంగ సాయి మీడియా అధినేత బాదం గిర్‌సాయి, ప్రతినిధి ఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఈ సినిమాకు 24 అవార్డులు వచ్చాయని, వీటిలో దర్శకుడికి 11 ఉండడం విశేషమని అన్నారు. మెగాస్టార్ చిరంజీవి ఇందులో ఓ పాత్రకు డబ్బింగ్ చెప్పారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల గాత్రావధాని రహమతుల్ల, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, నటుడు కళ్ల చిదంబరం కుమారుడు రామకృష్ణ, జనసేననాయకులుసత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సంవత్సరంలో రూ.443.29 కోట్ల వ్యాపారం

▸ మహారాజా కో ఆపరేటివ్ బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షులు రామకృష్ణంరాజు


మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రామకృష్ణంరాజు

సీతమ్మధార, జూలై 23: ది మహారాజా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ మార్చి 2024 నాటికి రూ.265.96 కోట్ల డిపాజిట్లు, రూ. 177.33 కోట్ల రుణాలందించడంతోపాటు రూ.443.29 కోట్ల వ్యాపార లావాదేవీలు సాగించినట్టు బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు తెలిపారు. సీతమ్మధారలోని క్షత్రియ కళ్యాణ మండపంలో బ్యాంక్ 24వ మహాజన సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4.02 కోట్లు స్థూల ఆదాయంను ఆర్జించగా రూ.1.02 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించి రూ.3.00 కోట్లు నికర ఆదాయం ఆర్జించినట్టు తెలిపారు. 2025-24 ఆర్థిక సంవత్సరానికి సభ్యులు, వాటాదారులకు 14 శాతం డివిడెండ్‌ను ప్రకటించారు. మార్చి 31 2025 నాటికి రూ.475 కోట్లు వ్యాపారం లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు వివరించారు. బ్యాంక్ తొలి సభ్యులు, కేంద్ర మాజీ పౌర విమానయాన శాఖా మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు సభకు ముఖ్య అతిథిగా విచ్చేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పైడా ఎడ్యుకేషనల్ అకాడమీ ఛైర్మన్ పైడా కృష్ణ ప్రసాద్, పలు బ్యాంక్‌ల ఛైర్మన్లు, డైరెక్టర్లు జి. మధనగోపాల స్వామి, ఎస్‌వీఎస్ఎస్ రామచంద్రరాజు, బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎస్ఎస్ సత్యనారాయణ, బ్యాంక్ డైరెక్టర్లు, ఖాతాదారులు, వాటాదారులు తదితరులు పాల్గొన్నారు.

26న జాబ్‌మేళా

కంచరపాలెం, జూలై 23 : కంచరపాలెంలోని జిల్లా ఉపాధికార్యాలయంలో ఈనెల 26వ తేదీన జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ఉపాధికల్పనాధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేళాలో నగరంలో నిఎనిమిది ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారన్నారు. పదో తరగతి, ఇంటర్,డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ తదితర కోర్సులు ఉత్తీర్ణులైన వారు హాజరుకావచ్చును. ఆసక్తి గల వారు నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్ నందు తమ వివరాలను ముందుగా నమోదు చేయాలని కోరారు.

నవోదయ విద్యాలయ కమిటీతో కలెక్టర్ సమావేశం

మహరాణిపేట, జూలై 23: కలెక్టరేట్‌లో జవహర్ నవోదయ విద్యాలయ యాజమాన్య కమిటీతో కలెక్టర్ ఎన్ఎం హరేంధిర ప్రసాద్ సమావేశమయ్యారు. పాఠశాలల కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్‌కు ప్రిన్సిపాల్ వైయస్ చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెం టేషన్ ద్వారా పాఠశాలలోని పలు విషయాలను వివరించారు. ఇటీవల పారా అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్ విభాగంలో విద్యాలయానికి చెందిన విద్యార్థిని తేజస్విని స్వర్ణ, రజత పతకాలు సాధించడంపై ఆమెను కలెక్టర్ అభినందించారు. మైగ్రేషన్ పథకం కింద మధ్య ప్రదేశ్‌నుంచి నవోదయ విద్యాలయానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. విద్యాలయ అభివృద్ధికి సహకారమందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో డీఈవో చంద్రకళ,విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్‌పాల్గొన్నారు.

జీవీఎంసీ నూతన కమిషనర్‌తో సమావేశం

జీవీఎంసీ నూతన కమిషనర్‌గా నియమితులైన పి. సంపత్‌కుమార్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చారు. అనంతరం సమావేశమై పలు అంశాలు చర్చించారు.

కమిషనర్‌ను కలిసిన సచివాలయ ఉద్యోగులు


కమిషనర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న సచివాలయ ఉద్యోగులు

మహారాణిపేట, జూలై 23: జీవీఎంసీ నూతన కమిషనర్ సంపత్‌కుమార్‌ను గ్రామ వార్డు సచి వాలయ ఉద్యోగుల ఫెడరేషన్ సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జీవీ ఎంసీ ఎంప్లాయీస్ గౌరవ అధ్యక్షుడు ఆనందరావు ఆధ్వర్యంలో వెళ్లి కమిషనర్‌కు పుష్ప గుచ్ఛ మందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి. కిరణకుమార్, జిల్లా అధ్యక్షుడు జె. గణేష్‌కుమార్, బి.వి. అశోక్ కుమార్, పవన్‌కుమార్, చింత కాయల బంగార్రాజు, జి. శ్యామలరావు సురేంద్ర, కర్రి రాజేష్, పి. నాగేశ్వరావు చంద్రబాబునాయుడు తదితరులున్నారు.

రైతుబజారులో అధికారుల తనిఖీ


కందిపప్పు తనిఖీ చేస్తున్న అధికారి ప్రవల్లిక

అక్కయ్యపాలెం, జూలై 23 : నరసింహనగర్ రైతుబజారులో వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు ఎస్‌కే యాసీన్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం సబ్సిడీ టమాటా విక్రయిస్తున్న డ్వాక్రా సభ్యులతో మాట్లాడారు. కందిపప్పు, రైస్ కౌంటర్‌ను పరిశీలించారు. అలాగే, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం కౌంటర్‌ను జిల్లా పౌరసరఫరా శాఖ క్వాలిటీ చెకింగ్ ఆఫీసర్ పి.ప్రవల్లిక తనిఖీ చేశారు. వీరితోపాటు రైతుబజారు ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ ఉన్నారు.

కొత్త ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో గరీబ్‌రథ్


బోగిలో సౌకర్యాలు

విశాఖపట్నం, జూలై 23: విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12739) మంగళవారం ఆధునిక కొత్త ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో విశాఖ నుంచి బయలుదేరి వెళ్లింది. ఐసీఎఫ్ రేక్ స్థానంలో 18 థర్డ్ ఏసీ ఎకానమీ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో అందుబాటులోకి వచ్చింది. ఈ రైలులో తరచూ రాకపోకలు సాగించే ప్రయాణికులు మంగళవారం మారిన కొత్త కోచ్‌లను చూసి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, సైడ్ విండో మిడిల్ బెర్తులను తొలగించడంపై హర్షం వ్యక్తంచేశారు. సౌకర్యంగా ఉన్న కోచ్‌ల్లో ప్రయాణం సాఫీగా సాగుతుందని అన్నారు.

ఎన్ఎస్‌టీఎల్ వ్యవస్థాపక వేడుకలు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ అబ్రహం వరుగీస్

గోపాలపట్నం, జూలై 23: ఎన్ఎస్‌టీఎల్ వ్యవస్థాపక వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్‌టీఎల్ స్థాపించి ఈ ఏడాదితో 55 ఏళ్లు పూర్తి కానున్నాయన్నారు. వ్యవస్థాపన వేడుకలను పురస్కరించుకుని సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం ఎన్ఎస్‌టీఎల్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్న పలు క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ ప్రథమ మహిళ ఇలిన్ దీనా అబ్రహం, ఎన్ఎస్‌టీఎల్ వ్యవస్థాపన దినోత్సవ వేడుకల నిర్వహణ కమిటీ ఛైర్‌పర్సన్, సింటిస్ట్-జి జి.పలాక్షి, శాస్త్రవేత్తలు వైవీఎస్ చంద్రశేఖర్, సజ్యోతి వర్మ, కె.పిచ్చయ్య, అర్బన్‌కుమార్, డాక్టర్ హెచ్ఎస్ దాస్, డాక్టర్ రాధాకృష్ణ, ఎన్ఎస్‌టీఎల్ వర్క్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఐపీమేట్‌లో 'థింక్‌ప్లస్' విద్యార్థుల ప్రతిభ

సీతంపేట, జూలై 23: ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ యాప్టిట్యూడ్ టెస్ట్ (ఐపీమేట్) ప్రవేశ పరీక్షల్లో అక్కయ్యపాలెంలో నరసింహనగర్‌లోని థింక్‌ప్లస్ విద్యా సంస్థ విద్యార్థులు ప్రతిభ కనపరిచి అర్హత సాధించినట్టు సంస్థ డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. గత మే, జూన్‌లలో నిర్వహించిన ఐపీమేట్ రోహటక్, ఐపీమేట్ ఇండోర్, జిప్‌మేట్ ప్రవేశ పరీక్షలో (బీబీఏ, ఎంబీఏ) ఐదేళ్ల ప్రోగ్రామ్‌లో పది మంది తమ విద్యార్థులు అర్హత సాధించారన్నారు. ఐఐఎం ఇండోర్‌లో వర్షిత్ సాయి సోమేష్, ఐఐఎం రోహటక్‌లో లికిత్ చరణ్, జాస్మిని, సిరి వర్శిణి, సాయిరాజ్, పవన్ ప్రతీక్, కుందన, ఐఐఎం జమ్ములో హసినీ, అన్విత, ఐఐఎం బోధగాయాలో అంకుర్ విద్యార్థులు అర్హత సాధించినట్టు పేర్కొన్నారు. వీరిని అభినందించారు.

జీవీఎంసీ కమిషనర్‌కు మేయర్ అభినందనలు


జీవీఎంసీ కమిషనర్‌గా నూతన బాధ్యతలుస్వీకరించిన సంపత్‌కుమార్‌ను అభినందిసున్న మేయర్ హరివెంకట కుమారి -విశాఖపట్నం

ఈవీఎం గొడౌన్ల తనిఖీ


చినగదిలోని ఈవీఎంల తనిఖీలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నాయకులు

ఆరిలోవ, జూలై 23: చినగది మండల తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని ఈవీఎం గొడౌన్‌లను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా ఉదయం వివిధ పార్టీల నేతలు, స్థానిక అధికారులతో కలసి సందర్శించారు. పరిసరాలను, సీసీ కెమెరాల ఆయన పరిశీలించారు. భద్రతాపరంగా పటిష్ట చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అక్కడ లాగ్‌బుక్‌లో ఆయన సంతకం చేశారు. ఆయన వెంట నాయకులు అయిన ఒమ్మి పోలారావు, కె.వి. రమణ, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్, ఎలక్షన్ సెల్ అధికారులు, రెవెన్యు అధికారులు పాల్గొన్నారు.

'48వ వార్డు అభివృద్ధికి సహకరించండి'

కంచరపాలెం, జూలై 23 : జీవీఎంసీ 48వార్డు కొండవాలు గ్రామాలు అభివృద్ధికి తోడ్పాటును అందించాలని నూతనంగా గ్రేటర్ కమిషనర్ సంపత్ కుమార్‌ను కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు చేపట్టిన సంపత్ కుమార్‌ను అప్పారావు మర్యాద పూర్వకంగా కలిశారు. కొండవాలు గ్రామాల్లో రోడ్లు,డ్రైన్లు, రిటైనింగ్ వాల్స్, మెట్లు తదితర సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్టు వివరించారు.

నగలు పోయిన వారు సంప్రదించాలి: ఎస్ఐ

సీతంపేట, జూలై 23: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు నెలల క్రితం దొండపర్తికి చెందిన ఒక ఆటో డ్రైవర్ తనకు దొరికిందని బంగారు మండ చైన్, సాయిరామ్ పార్లర్ వద్ద మరొకరికి దొరికిన బంగారు గొలుసు పోలీసులకు అప్పగించారు. అయితే, ఈ ఆభరణాల కోసం ఎవరూ రాకపోవడంతో పాటు ఎటువంటి ఫిర్యాదులు నమోదు కాలేదని క్రైమ్ ఎస్ఐ భాస్కరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆభరణాలపై 106 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఆభరణాలు పోయిన వారు ఎవరైనా ఉంటే.. సరైన ధ్రువపత్రాలతో తమను సంప్రదించాలని కోరారు.

అభివృద్ధికి ఊతం

... 5వ పేజీ తరువాయి

కేంద్రం కొంత మేరకు సాయం అందిస్తోంది. కొత్తగా కేటాయించే నిధుల్లో విశాఖకు కూడా వాటా లభిస్తుంది. కొత్త ఆవిష్కరణలు జరుగుతాయి.

▸ సముద్ర ఉత్పత్తుల ఎగుమతిలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే మొదటి స్థానంలో ఉంది. అందులో అత్యధిక శాతం విశాఖపట్నం పోర్టు నుంచే ఎగుమతి అవుతున్నాయి. వీటిని ఇంకా ప్రోత్సహించడానికి కేంద్రం రొయ్యల మేతకు దిగుమతి చేసుకునే వాటిపై సుంకం ఐదు శాతం తగ్గించింది.

▸ 25 రకాల ఖనిజాలపై కస్టమ్స్ డ్యూటీ ఎత్తేశారు. దాంతో ఆయా ఖనిజాల ఎగుమతి పెరగనుంది. అమ్మోనియం నైట్రేట్ విశాఖపట్నం పోర్టుకే ఎక్కువ దిగుమతి అవుతుంది. డొమెస్టిక్ పరిశ్రమను రక్షించడానికి సుంకం 7.5 శాతం నుంచి 10 శాతం పెంచారు. దీనివల్ల ప్రమాదకరమైన అమ్మోనియం నైట్రేట్ దిగుమతులు తగ్గనున్నాయి.

▸ పరిశ్రమల్లో మహిళలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించారు. దీనివల్ల పారిశ్రామిక సంస్థల్లో మహిళల సంఖ్య పెరగనుంది.

▸ విశాఖపట్నంలోని పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలకు కేటాయింపులు చేశారు. విశాఖపట్నం పోర్టుకు రూ.150 కోట్లు, హెచ్‌పీసీఎల్‌కు రూ.50 కోట్లు ఇచ్చారు.

▸ విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు మూలధన వ్యయం కింద రూ.620 కోట్లు సర్దుబాటు చేయనున్నారు.

పోలవరం పూర్తితో ఉత్తరాంధ్రాకు మేలు

పోలవరం పూర్తిచేసే బాధ్యత తీసుకుంటామని ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీనివల్ల ఉత్తరాంధ్రా జిల్లాలకు మేలు జరగనుంది. ఇక్కడి పరిశ్రమలకు అవసరమైన నీటితో పాటు సాగునీరు, నగర వాసుల తాగునీటి సమస్యలు తొలగిపోతాయి. అదేవిధంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి దోహదపడుతుంది.

దర్జాగా భూ కబ్జా

... 5వ పేజీ తరువాయి

చదునుచేస్తే ఎవరైనా అభ్యంతరం చెబుతారనే ఉద్దేశంతో అక్కడ ఒక ఆలయం పేరుతో చిన్నపాటి పర్ణశాలను నిర్మించారు. దానికి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తంకాకపోవడంతో ఆ స్థలాన్ని డెబ్రిస్‌తో చదునుచేసి, గ్యాస్ సిలెండర్ల లోడింగ్, అన్‌లోడింగ్ ప్రారంభించారు. ప్రభుత్వ స్థలం కావడంతో అక్కడ ఆక్రమణలను అడ్డుకునేందుకు స్థానిక రెవెన్యూ ఉద్యోగి ఒకరు కొద్దిరోజుల కిందట అక్కడకు వెళ్లారు. ఆక్రమణలపై ప్రశ్నించగా...స్థానికంగా ప్రజా ప్రతినిధిగా చెప్పుకుంటున్న నాయకుడి కుటుంబ సభ్యులు తనపై దాడి చేశారంటూ అతను పోలీసులకు ఫిర్యాదుచేశారు. తర్వాత కొద్దిరోజులపాటు ఆ స్థలంలో ఎలాంటి పనులు చేపట్టకుండా ఆగిపోయినప్పటికీ ఇటీవల మళ్లీ మొదలెట్టారు. ఈ విషయం చినగదిలి తహసీల్దార్ అధికారుల వద్ద ప్రస్తావించగా అది ప్రభుత్వ బంజరుభూమి అయినప్పటికీ డెయిరీ ఫారానికి కేటాయించామన్నారు. ఆక్రమణలను స్థానిక వీఆర్‌ఓ గుర్తించి తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. అయితే ఆ భూమి డెయిరీ ఫారానిది కావడంతో ఆక్రమణలకు సంబంధించిన సమాచారాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు. అయితే డెయిరీఫారం అధికారులు దీనిపై మిన్నకుండిపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ఆక్రమణదారులతో కుమ్మక్కైపోవడం వల్లే సర్వేనంబర్ 55లోని భూమి క్రమంగా అన్యాక్రాంతమైపోతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా డెయిరీ ఫారం అధికారులు స్పందించి విలువైన స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

బస్సులు సిద్ధం చేసుకుంటున్న ఆర్టీసీ

ద్వారకా బస్‌స్టేషన్, జూలై 22:

మహిళలకు ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించేందుకుబస్సులు సిద్ధం చేసుకున్నట్టు ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు ప్రకటించారు. కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా సమాయత్తమైనట్టు రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పలరాజు వెల్లడించారు. విశాఖ రీజియన్‌లోని మధురవాడ, వాల్తేరు, మద్దిలపాలెం, విశాఖపట్నం, గాజువాక, స్టీల్‌సిటీ, సింహాచలం డిపోల పరిధిలో ప్రస్తుతం 721 బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. ప్రతిరోజు 1.45 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిలో సగం మంది మహిళలు ఉంటున్నారు. అంటే సుమారు 72,500 మంది. ఉచిత రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తే మహిళా ప్రయాణికుల సంఖ్య మరో పది శాతం పెరిగి 79,750 చేరుకోవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. రీజియన్ పరిధిలో సిటీ ఆర్డినరీ, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో, జేఎన్ఎన్‌యూఆర్ఎం సర్వీస్‌లు 579 వరకూ ఉన్నాయి. ఈ సర్వీస్‌లలో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించే పరిస్థితి ఉంటే పీక్ సమయంలో అంటే ఉదయం 8.00 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 గంటల వరకు ఈ బస్సులన్నీ రద్దీగా మారే అవకాశం ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఆ రద్దీని తట్టుకునేందుకు ప్రతి డిపోలో ఉన్న రెండు స్పేర్ బస్సులను కూడా ఆ సమయాల్లో నడిపేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ ఏర్పాట్లుచేసుకుంటోంది.

త్వరలో మరో 33 బస్సులు

విశాఖ రీజియన్‌లో గతంలో 721 బస్సులు ఉండగా, ఇటీవల 12 కొత్త బస్సులు వచ్చాయి. మరో 33 కొత్త బస్సులు త్వరలో రానున్నాయి. బస్సుల సంఖ్య పెరగనున్నందున రద్దీ తక్కువగానే ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మహిళా ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైనన్ని బస్సులు అన్ని రూట్లలోను నడిపేందుకు తాము ప్రణాళిక, రూట్ మ్యాప్ సిద్ధం చేసుకున్నట్టు రీజనల్ అధికారులు వెల్లడించారు.



పెద్ద చేపల జాడ లేదాయె..

మేహాద్రిగెడ్డ జలాశయంలో కానరాని మీనాల సందడి

తీవ్ర నిరాశలో మత్స్యకారులు

పెందుర్తి-రూరల్, జూలై 23: నగర శివారు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ పేరు చెబితే చాలు నగరంలోని మాంసాహారులకు చేపలు గుర్తుకొస్తాయి. రాగి ఎండి, శీలావతి, బుర్రబొచ్చు, బొచ్చు వంటి ఇలా పలు రకాల పెద్ద పెద్ద చేపలు ఈ రిజర్వాయరులో లభ్యమవుతాయి. అయితే ఈ ఏడాది మాత్రం ఆయా చేపలు పెద్దగా కానరావడం లేదు. సుమారు పది నుంచి ఇరవై కిలోల వరకు బరువు గల బొచ్చు చేపల రుచే వేరు. ఈ రిజర్వాయరులో చేపలన్నీ నీటిలో ఉన్న గడ్డి, నాచు తీసుకుని సహజంగా పెరిగినవే తప్పా చెరువు చేపల మాదిరిగా పెంచినవి కావు. వీటి రుచి కూడా అమోఘంగా ఉంటుందని మాంసాహారులు చెబుతుంటారు. అందుకే నగరవాసులు వీటిని ఎక్కువగా



ఎండిపోవడంతో రిజర్వాయర్ గర్భంలో కొనసాగుతున్న వ్యవసాయ సేద్యం



ప్రస్తుతం రిజర్వాయరులో మత్స్యకారుల వలలకు చిక్కుతున్న గొరసలు, తండెంగ చేపలు

ఇష్టపడి ధరకు కూడా వెనకాడకుండా దూర ప్రాంతాల నుంచి సైతం ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. కొన్నిసార్లు వలకు చిక్కిన ఒక్కో చేప 20 కిలోలకు పైగా ఉంటోంది. వర్షాకాలంలో రోజూ వేపగుంట, సబ్బవరం రహదారిలో రిజర్వాయర్‌కు ఆనుకొని ఉన్న బ్రిడ్జి వద్దకు వందలాది మంది ద్విచక్ర వాహనాలు, కారుల్లో వచ్చి వీటిని కొనుగోలు చేస్తుంటారు. ఆ సమయంలో చేపల మార్కెట్ సందడిగా కనిపిస్తోంది. అయితే ప్రస్తుతం సరైన వర్షాలు లేక రిజర్వాయర్‌లో నీరు అడుగంటడంతో మత్స్యకారుల వలలకు చేపలు చిక్కడం లేదు. దీంతో చేపల బజారులో సందడి కూడా కరువైంది. ప్రస్తుతం బొచ్చు చేపలు, శీలావతి వంటివి కాకుండా చిన్న చేపలు మాత్రమే మత్స్యకారుల వలకు చిక్కుతున్నాయి. వీటి వల్ల పెద్దగా ఆదాయం రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్ల నుంచి ఇదే పరిస్థితి..

మేహాద్రిగెడ్డ రిజర్వాయరునే నమ్ముకుని చేపల వేటపై జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు సరైన వర్షాలు లేక మూడేళ్ల నుంచి కష్టాలు మొదలయ్యాయి. స్థానిక పెదగాడి, జెర్రిపోతులపాలెం, చింతగట్ల, పొర్లుపాలెం, చింతలఅగ్రహారం గ్రామాలకు చెందిన మత్స్యకారులతో పాటు స్థానికేతర గంగపుత్రులు కూడా ఇక్కడకు వలస వచ్చి చేపల వేట సాగిస్తుంటారు. రిజర్వాయర్ గర్భంలో సమృద్ధిగా నీరుంటేనే పెద్ద చేపలు నీటికి ఎదురీదుతూ వలలకు చిక్కుతుంటాయి. వర్షం కురిసిన తర్వాత రిజర్వాయరులోకి ఎర్ర నీరు వచ్చి చేరితే బొచ్చు చేపలకు సందడే సందడి. ఎర్ర నీటి చేరికతో ఇబ్బడిముబ్బడిగా మత్స్యకారుల వలలకు ఇవి చిక్కుతుంటాయి. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి కానరావడం లేదు. నీరు లేక రిజర్వాయర్ బాగా ఎండిపోయింది. కొద్దిపాటి నీరే రిజర్వాయర్ గేట్ల వద్ద కనిపిస్తోంది. బొచ్చు, శీలావతి వంటి చేపల స్థానంలో ఇప్పుడు గొరసలు, తండెంగ రకాలు లభిస్తున్నాయి. కానీ వీటిని కొనుగోలు చేసేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో తమ జీవనం కష్టతరంగా మారిందని పలువురు మత్స్యకారులు వాపోతున్నారు. అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసినా వాటివల్ల ఉపయోగం లేదని వారు పేర్కొంటున్నారు. అతి భారీ వర్షాలు కురిస్తేనే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, అవి ఎప్పుడు కురుస్తాయోనని వారంతా ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.



బొచ్చు, శీలావతి వంటి పెద్ద చేపలు లేక వెలవెలబోతున్న బజారు



పొలంలో ఏర్పాటు చేసిన తమన్నా ఫ్లెక్సీ

పంటకు రక్షణగా సినీ నటి తమన్నా ఫ్లెక్సీ!

పెందుర్తి, జూలై 23: పచ్చటి పైరులో ఓ సినీ తార చిత్రం ఆకట్టుకుంటోంది. మండల శివారు ప్రాంతంలోని కూరగాయల పంట పొలాల్లో మిడతల దండు, కీటకాల నుంచి రక్షణగా ప్రముఖ హీరోయిన్ తమన్నా ఫ్లెక్సీని రైతులు ఏర్పాటు చేశారు. గతంలో పంట పొలాల్లో ఈ విధంగా దిష్టిబొమ్మలను ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు వాటి స్థానంలో ఇలా సినీ తారల చిత్రాలు కనిపిస్తున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారంతా తమన్నా ఫెక్సీని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

93వ వార్డులో జోరుగా యూజీడీ పనులు

వేపగుంట, జూలై 23: గ్రేటర్ 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురం సమీపంలోని పల్లి నారాయణపురం, రామాలయం వీధి, తదితర ప్రాంతాల్లో యూజీడీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో రోడ్డు మధ్యలో గోతులు తవ్వి పైపులైన్లను వేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే ఇళ్ల నుంచి వచ్చే వాడుక నీరు దిగువ ప్రాంతానికి సక్రమంగా పారేలా చర్యలు చేపడతారు. గతంలోనే ఈ పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ కొన్ని అనివార్య కారణాలతో నిలిచిపోయాయి. ఎట్టకేలకు ఇప్పుడు ఈ పనులు చకచకా సాగుతుండడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పల్లినారాయణపురంలో

డాక్‌యార్డు సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి సుభాష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న యూనియన్ నాయకులు

మల్కాపురం, జూలై 23: తూర్పు నౌకాదళ పరిధి నేవల్ డాక్‌యార్డుతో పాటు మెటీరియల్ ఆర్గనైజేషన్‌లో పర్మినెంట్ రక్షణ ఉద్యోగులుగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు అమరావతిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు ఓటీపై హెచ్‌ఆర్ లెక్కగట్టి ఇవ్వాలని, కోర్టు కేసులను ఇంప్లిమెంట్ చేయాలని, ఫ్యాక్టరీ యాక్ట్ ప్రకారం ఓటీ గంటలను పెంచాలని, డైలీవేజ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, తదితర అంశాలను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రికి దుశ్శాలువా కప్పి సత్కరించడంతో పాటు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సబ్బం కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఉడతా అప్పలరాజు, ప్రతినిధులు ఎంవై ప్రసాద్‌బాబు, పి.సాయికుమార్, సునీల్ కుమార్, ఎస్.రమేశ్, జి.వెంకటేశ్, వి.గణేశ్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

క్లినికల్ రీసెర్చిపై విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, జూలై 23: దువ్వాడ విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు క్లినికల్ రీసెర్చిపై మంగళవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. అమెరికాలో డేటా సైంటిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ ఇకుర్తి వెంకట్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల దశలోనే పరిశోధనలపై పట్టు సాధించి నూతన ఆవిష్కరణలను రూపొందించాలన్నారు. ఔషధ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు తగ్గట్టుగా ఫార్మసీ విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. అనంతరం ఆయన ఔషధ ఆవిష్కరణ, డ్రగ్స్ డెవలప్‌మెంట్ క్లినికల్ ట్రయల్స్ ప్రక్రియ, స్టాస్టికల్ విద్య గురించి వివరించారు. అలాగే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ వైశ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కమలకుమారి, ప్లేస్‌మెంట్ అధికారి వసుంధర, సీఎస్ శర్మ, చిరంజీవి,వసంత,రంజిత, తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

గోపాలపట్నం, జూలై 23: జీవీఎంసీ 89వ వార్డు పరిధి కొత్తపాలెంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లడంతో పలువురు వ్యాపారులు మరింత ఇబ్బంది పడ్డారు. ముందస్తు సమాచారం లేకుండా అప్రకటిత విద్యుత్ కోతలు విధించడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పంట నష్టం అంచనాపై అధికారుల సర్వే

పెందుర్తి, జూలై 23: అల్పపీడనం ప్రభావంతో మండలంలో కురిసిన వర్షాలకు వాటిల్లిన పంట నష్టం అంచనాపై వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించారు.



సరిపల్లిలోని ఓ పొలంలో వ్యవసాయాధికారులు

ఈ మేరకు మంగళవారం సరిపల్లి, గుర్రమ్మపాలెం, గొరపల్లిల్లో వ్యవసాయశాఖ డీఈవో ఎ.అప్పలస్వామి, ఏవో మాణిక్యమాంబ, వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, తదితరులు పర్యటించారు. పలు పొలాలను పరిశీలించి పంట నష్టం అంచనా వేశారు. సీడ్ డ్రిల్‌తో నేరుగా వేసిన వరి పొలాలకు నష్టం వాటిల్లలేదని నిర్ధారించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు సరిత, రామలక్ష్మి, ప్రసాద్‌లు పంట నష్టంపై శాస్త్రీయ ఆధారాలతో గణన చేశారు.



మహిళా రైతుల కార్డులను పరిశీలిస్తున్న యాసిన్

రైతు బజారులో తనిఖీలు

పెందుర్తి, జూలై 23: స్థానిక రైతు బజారును మంగళవారం జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి యాసిన్ సందర్శించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన రాయితీ కందిపప్పు, బియ్యం విక్రయాల కేంద్రాన్ని తనిఖీ చేసి వాటి నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులను అందించాలనే లక్ష్యంతో రైతు బజార్లలో ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం విక్రయాల కౌంటర్లలో అవకతవకలు చోటుచేసుకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రైతుబజారులోని దుకాణదారుల కార్డులను తనిఖీ చేశారు. రాయితీ టమాటా నాణ్యతపై వినియోగదారులతో కాసేపు ముచ్చటించారు. రైతుబజార్ నిర్వహణపై యాసిన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎస్టేట్ అధికారి వీఎస్‌పీ షర్మిల, సహాయకుడు చిన్నబ్బాయ్ ఉన్నారు.

కమిషనర్‌ను కలిసిన టీడీపీ కార్పొరేటర్లు



సంపత్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

పెదగంట్యాడ, జూలై 23: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు చేపట్టిన పి.సంపత్‌కుమార్‌ను టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, బొండా జగన్, బొడ్డు నరసింహపాత్రుడు, రాజాన రామారావు, దల్లి గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)
- **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),
- **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),
- **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 61, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 10, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 42, క్యాబేజీ 32, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 33, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 145, మునక్కాడలు (కిలో) 100, బరబాటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 40, కీరదోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 62, దేముడుచిక్కుడు 82, కొండ ఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	194
స్కిన్‌లెస్	--	204

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

జనావాసాల మధ్య వర్షపు నీరు తిష్ట

అధికమవుతున్న దోమల బెడద

జ్వరాలు విజృంభిస్తున్నాయని వాపోతున్న ప్రజలు

గాజువాక, జూలై 23: గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడడంతో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో పలు అనారోగ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు వార్డుల్లో ప్రజలు జ్వరాలతో బాధ పడుతున్నారు. పలు ప్రాంతాల్లో వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దోమల బెడద అధికమైంది. దోమలు స్వైరవిహారం చేస్తూ ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని, దీంతో జ్వరాలు ప్రబలుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నియంత్రణలో సంబంధిత విభాగం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని పలువార్డుల ప్రజలు సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెడ్సీకి వినతులు అందజేశారు. ఈ సమస్యను జోనల్ వైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లగా ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే దోమల నియంత్రణకు నీటిలో లార్వా సంహారక మందులు చల్లడంతో పాటు అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయిస్తున్నట్టు పేర్కొన్నారు.



గాజువాకలో జనావాసాల మధ్య నిలిచిన వర్షపు నీరు

ఏ ఇంట్లో చూసినా ఒకరిద్దరు జ్వరపీడుతులే..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత వాసులను జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. ఏ ఇంట్లో చూసినా ఒకరిద్దరు జ్వరాలతో బాధ పడుతున్నారు. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పత్రులకు రోజురోజుకు జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకు అధికమవుతుంది. ఇప్పటికే జ్వరాలతో పలువురు ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. గత కొది రోజులుగా కురుస్తున వర్షాలను పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ రోజుల తరబడి నీరు తిష్ట వేయడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో జ్వరం, దగ్గు, జలుబు, బాడీ పెయిన్స్‌తో ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు వాపోతున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి ఎక్కడికక్కడ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు. అలాగే అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని వేడుకుంటున్నారు.

మహిళా శిశు సంక్షేమానికి ప్రోత్సాహం

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పెందుర్తి, జూలై 23: మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సాహన్ని అందిస్తుందని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. పెందుర్తిలోని జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో మంగళవారం గ్రామీణ మండలాల జిల్లా సమాఖ్య సభ్యులకు మహిళా సాధికారిత, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం అనే అంశంపై అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారిత ప్రభుత్వ పథకాల పట్ల అవగాహనతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ క్రమంలో సభ్యులు ఆరోగ్యం, పిల్లలు విద్యపై దృష్టి సారించాలన్నారు. కుటుంబ జీవన ప్రమాణం మెరుగు కోసం ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాల పట్ల అవగాహనను పెంచుకోవాలని పేర్కొన్నారు. లింగ వివక్ష, బాల్య వివాహాల నియంత్రణ, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సదస్సులో చర్చించిన అంశాలు, నేర్చుకున్న విషయాలను గ్రామ సభ్యులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం నల్ జల్ మిత్ర శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా ప్రగతి కార్యక్రమాల కు సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్‌ను హరేంధిర ప్రసాద్ తిలకించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి పథకాల సంచాలకులు, ఎంఎస్ఎంఈ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న హరేంధిర ప్రసాద్

సెయిల్‌లో విలీనమే స్టీల్‌ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం

ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు

కూర్మన్నపాలెం, జూలై 23: సొంత గనుల లేమి సమస్యతో కొట్టుమిట్టాడుతున్న స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయడమే శాశ్వత పరిష్కారమని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,258వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న ఉక్కు కర్మాగారంలో కనీసం 60 శాతం ఉత్పత్తికి కూడా సరిపడని ముడిసరకును సరఫరా చేయకుండా గత మూడేళ్లుగా ప్రభుత్వాలు కుట్రపూరిత చర్యలకు పాల్పడ్డాయన్నారు. కార్మికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. రా మెటీరియల్ ఉత్పత్తి, అమ్మకాల విషయంలో కర్మాగారంలో చోటుచేసుకున్న అవకతవకలపై జాతీయ స్థాయి సంస్థలతో దర్యాప్తు చేయాలన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ గనుల లీజు పొడిగింపునకు ఆదేశించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉక్కుకు ఆర్థిక సాయం చేసి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, కారు రమణ, అవతారం, మురళీరాజు, గంగవరం గోపి, వేములపాటి ప్రసాద్, ఇంటక్ కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో కార్మిక సంఘాల నాయకులు, ఇంటక్ కార్మికులు

గాజువాకలో యూజీడీని వినియోగంలోకి తేవాలి

-అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



గాజువాక, జూలై 23: గాజువాక నియోజకవర్గంలో నిరుపయోగంగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ)ని వినియోగంలోకి తీసుకురావాలని మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రస్తావించారు. 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలోని అన్ని యూజీడీ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో దీనిని సివిల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు అనుసంధానం చేయకపోవడంతో యూజీడీ నిరుపయోగంగా మారిందన్నారు. త్వరితగతిన దీనిని సివిల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు అనుసంధానం చేసి వినియోగంలోకి తేవాలని కోరారు.

భూగర్భ డ్రైనేజీపై శ్వేతపత్రం విడుదల చేయాలి

శాసనసభలో గళం విప్పిన 'పశ్చిమ' ఎమ్మెల్యే గణబాబు



గోపాలపట్నం, జూలై 23: విశాఖలో ఐదేళ్లుగా నిర్వహణ లేక అస్తవ్యస్తంగా ఉన్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థపై శ్వేతపత్రం విడుదల చేయాలని పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే పి.గణబాబు శాసనసభలో కోరారు. నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో దేశంలోనే స్వచ్ఛ నగరాల్లో ద్వితీయ స్థానంలో నిలచిన విశాఖ నగరం గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అస్తవ్యస్తంగా మారిందన్నారు. దీంతో ప్రధాన ప్రాజెక్టులైన యూజీడీ, నిరంతర నీటి సరఫరా పథకాలు అటకెక్కాయని పేర్కొన్నారు. యూజీడీ పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో వర్షాల సమయంలో రోడ్లపైకి మురుగు నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అందువల్ల యూజీడీ పనుల పూర్తికి సత్వర చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర బడ్జెట్‌పై టీఎన్‌టీయూసీ హర్షం

ఉక్కుటౌన్‌షిప్, జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నిధుల పట్ల టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం ముందుకు రావడం అభినందనీయమన్నారు.

ఘనంగా బీఎంఎస్ వ్యవస్థాపక వేడుకలు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 23: కార్మిక సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రీయ ఇస్పాత్ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ముందుకు సాగుతుందని అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. యూనియన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం స్టీల్‌ప్లాంటులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారం ఆవిర్భావం నుంచి స్టీల్‌ప్లాంటులో బీఎంఎస్ యూనియన్ ఉందని, ప్లాంట్ నిర్మాణ సమయం నుంచి ఇప్పటివరకు తమ యూనియన్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. సంస్థ అభివద్దే లక్ష్యంగా బీఎంఎస్ ముందుకు సాగుతుందన్నారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని, యాజమాన్యం చేపట్టే చర్యలకు తాము సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, రమణ, పెంటారావు, హరీశ్ వర్మ, కొల్లి శ్రీనివాస్, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

అగనంపూడి, జూలై 23: అనారోగ్య సమస్యల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. వార్డు పరిధిలోని బీసీ కాలనీ, కరణం వీధి, గొడ్డుపేట, ఆర్కే లేఅవుట్, మరిడిమాంబ కాలనీ ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జర్వాలతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు వచ్చినా తక్షణమే వైద్యులను సంప్రతించాలన్నారు. గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోయాయని పలువురు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన జీవీఎంసీ మలేరియా విభాగం అధికారులతో మాట్లాడి దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేపట్టాలని కోరారు. ఈ మేరకు మలేరియా విభాగం సిబ్బంది గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, స్థానిక నాయకులు వై.కోటేశ్వరరావు, వై.అప్పలరాజు, గుర్రం నాయుడు, పి.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక బోనాల జాతర రేపు

పెందుర్తి రూరల్, జూలై 23: మండలంలోని చింతల అగ్రహారంలోని నూకాంబిక ఆలయం వద్ద అమ్మవారి బోనాల జాతరను ఈ నెల 25న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు ఉదయం అమ్మవారిని శాకంబరిగా అలంకరిస్తామన్నారు. అనంతరం స్థానిక రామాలయం నుంచి బోనాల జాతర ప్రారంభమై గవరపాలెం భూలోకమాత ఆలయం, కృష్ణాలయం మీదుగా త్రిమాత ఆలయాన్ని సందర్శించాక నూకాంబిక ఆలయం వద్దకు చేరుతుందన్నారు.

ఘనంగా బీఎంఎస్ 70వ ఆవిర్భావ దినోత్సవం



మట్లాడుతున్న సంఘు నాయకుడు

మద్రిపాలెం, జూలై 23: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 70వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం 104 ఏరియాలోని ఎంఈఎస్ కార్యాలయంలో సంఘ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రొక్కం సురేష్ కు మార్, శరగడం రామ చంద్రశేఖర్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సహప్రాంత ప్రచారక్ ఇ. జనార్దనరావు పాల్గొని తొలుత పతాకా విష్కరణ చేశారు. అనం తరం ఆయన మాట్లాడుతూ బీఎంఎస్ గత 69 ఏళ్లలో ఏ రాజకీయ పార్టీలతో అనుబంధం లేదన్నారు. నిరంతరం కార్మికుల పక్షాన పోరాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. మహానగర్ సంఘ్ చాలక్ నారాయణరావు మాట్లాడుతూ కార్మికుల్లో జాతీయభావాన్ని పెంపొం దించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈకార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు మళ్ళ జగదీశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు, బ్రహ్మానందం, సత్యారావు, లాలం ప్ర సాద్, రాష్ట్ర కార్యదర్శి లోవరెడ్డి, స్టీల్‌ప్లాంట్, డాక్‌యార్డ్, హెచ్‌ఎస్‌ఎల్ నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖకు మొండిచేయి

▸▸ ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏఎస్ నాయుడు


ఏఎస్ నాయుడు

మద్రిపాలెం, జూలై 23: కేంద్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా వ్యవస్థకు మొండిచేయి చూపిందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏఎస్ నాయుడు విమర్శించారు. బడ్జెట్‌లో 9 ప్రధానమైన అంశాల్లో విద్యావ్యవస్థలో చోటు లేకపోవడం చాలా నిరాశపరిచిందన్నారు. 3.07 శాతం మాత్రమే విద్యా కేటా యింపులు న్నాయన్నారు. వేతన జీవుల కు ఆదాయ పన్ను రాయితీ కూడా నిరాశ జనకంగా ఉందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూలై 23: నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ తెలిపారు. అబిద్‌నగర్, అక్కయ్యపాలెం, రామచంద్రానగర్, టిడ్కో కాలనీ, సంతోష్ కాలనీ, ఎంటీసీ పాలెం, పుట్ట బంగారమ్మ గుడి ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాత నగరానికి కొత్తరూపు

▸▸ కురుపాం మార్కెట్‌నుంచి విక్టోరియా విగ్రహం వరకు రోడ్డు విస్తరణ పూర్తి

జగదాంబ కూడలి, జూలై 23: వన్‌టౌన్ రోడ్డు విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నారు. ఇందులో భాగంగా కురుపాం మార్కెట్ నుంచి విక్టోరియా విగ్రహం వరకు పాత నగరం సరికొత్తరూపుతో దర్శనమిస్తుంది. గతంలో ఇరుకు రోడ్లతో జనాలు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం 60 అడుగుల రోడ్డు మేర విస్తరించడంతో సువిశాలంగా మారింది. ఇరువైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణంతో పాటు అందంగా తారు రోడ్డు వేశారు. కురుపాం మార్కెట్ బజార్ రోడ్డు నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ఈ రోడ్డు అందుబాటులోకి వచ్చింది. విక్టోరియా విగ్రహం పరిసరాల్లో పాడైన రహదారులను అభివృద్ధి చేశారు. ఇప్పటికే వాచ్‌హౌస్ నుంచి పూర్ణామార్కెట్ వరకు రోడ్డుఆధునీకరణ పనులు పూర్తయ్యాయి. పూర్ణా మార్కెట్ మెయిన్ రోడ్డు నుంచి రీడింగ్ రూం కొంతమేర కురుపాం మార్కెట్ వరకు విస్తరణ పనులు నత్తనడగా సాగుతున్నాయి. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప లువురు కోరుతున్నారు. జగదాంబ నుంచి పాతనగరం కనబడేలా వన్‌టౌన్ రహదారి నిర్మాణ పనులు రూపుదిద్దుకున్నాయి. కొత్తగా హైటవర్ విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేశారు. రాత్రి వేళ విద్యుత్ కాంతులతో ఈ మార్గం కొత్త వెలుగులతో కనిపిస్తోంది.


బీటీ రోడ్డు

బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం: సీపీఐ



రైల్వే స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

అల్లిపురం, జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ నాయకులు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం విశాఖరైల్వే స్టేషన్ ప్రధానద్వారం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ రూ. 47.65 లక్షల కోట్ల అంచనాతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు కేటాయించడం తగదన్నారు. విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయడంలేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఒక్క రుపాయి కేటాయింపు లేదని మండి పడ్డారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకుంటామని హామీలు ఇచ్చి మభ్యపెడుతోందన్నారు. రైల్వే జోన్ ఏర్పాటు ఎటువంటి నిధులు కేటాయింపులు ప్రకటించలేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రకటన చేయకపోవడం అన్యాయమన్నారు. ఆదాయపన్ను మినహాయింపులో పేద మధ్య తరగతి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసారని, కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కె రెహమాన్, పి. చంద్రశేఖర్, ఆర్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'కళ్లు' సినిమాకు ప్రేక్షకుల ఆదరణ మరవలేం

▸▸ దర్శకుడు రఘు స్పందన


మాట్లాడుతున్న దర్శకుడు ఎంవీ రఘు

సీతంపేట, జూలై 23: కళ్లు సినిమాకు ప్రేక్షకుల ఆదరణ మరువలేనిదని దర్శకుడు ఎం.వి. రఘు తెలిపారు. ఈ చిత్రం విడుదలై 35 ఏళ్లు పూర్తికావడంతో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఈ చిత్ర ప్రదర్శన, ఈ సినిమాలో నటించిన నటీనటులు, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు రఘు తన స్పందనను తెలియజేశారు. రచయిత, సినీ నటుడు గొల్లపూడి మారుతిరావు నాటికను కళ్లు సినిమాగా రూపొందించినట్టు చెప్పారు. ఈ సినిమాకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చక్కటి సంగీతం అందించారన్నారు. సిరివెన్నెల సీతారామ శాస్త్రి పాటలు హైలెట్‌గా నిలిచాయన్నారు. విశాఖలో ఎంతో మంది సహకారంతో ఈ సినిమా పూర్తి చేశామన్నారు. ఈసినిమా కమలహాసన్ నటించిన స్వాతిముత్యంతోపాటు విడుదలైందన్నా, తమ సినిమాను ప్రేక్షకులు ఎంతో ఆదరించారన్నారు. రంగ సాయి మీడియా అధినేత బాదం గీర్‌సాయి, ప్రతినిధి ఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఈ సినిమాకు 24 అవార్డులు వచ్చాయని, వీటిలో దర్శకుడికి 11 ఉండడం విశేషమని అన్నారు. మెగాస్టార్ చిరంజీవి ఇందులో ఓ పాత్రకు డబ్బింగ్ చెప్పారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల గాత్రావధాని రహమతుల్ల, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, నటుడు కళ్ల చిదంబరం కుమారుడు రామకృష్ణ, జనసేననాయకులుసత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సంవత్సరంలో రూ.443.29 కోట్ల వ్యాపారం

▸▸ మహారాజా కో ఆపరేటివ్ బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షులు రామకృష్ణంరాజు


మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రామకృష్ణంరాజు

సీతమ్మధార, జూలై 23: ది మహారాజా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ మార్చి 2024 నాటికి రూ.265.96 కోట్ల డిపాజిట్లు, రూ. 177.33 కోట్ల రుణాలందించడంతోపాటు రూ.443.29 కోట్ల వ్యాపార లావాదేవీలు సాగించినట్టు బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు తెలిపారు. సీతమ్మధారలోని క్షత్రియ కళ్యాణ మండపంలో బ్యాంక్ 24వ మహాజన సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4.02 కోట్లు స్థూల ఆదాయంను ఆర్జించగా రూ.1.02 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించి రూ.3.00 కోట్లు నికర ఆదాయం ఆర్జించినట్టు తెలిపారు. 2025-24 ఆర్థిక సంవత్సరానికి సభ్యులు, వాటాదారులకు 14 శాతం డివిడెండ్‌ను ప్రకటించారు. మార్చి 31 2025 నాటికి రూ.475 కోట్లు వ్యాపారం లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు వివరించారు. బ్యాంక్ తొలి సభ్యులు, కేంద్ర మాజీ పౌర విమానయాన శాఖా మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు సభకు ముఖ్య అతిథిగా విచ్చేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పైడా ఎడ్యుకేషనల్ అకాడమీ ఛైర్మన్ పైడా కృష్ణ ప్రసాద్, పలు బ్యాంక్‌ల ఛైర్మన్లు, డైరెక్టర్లు జి. మధనగోపాల స్వామి, ఎస్‌వీఎస్‌ఎస్ రామచంద్రరాజు, బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎస్‌ఎస్ సత్యనారాయణ, బ్యాంక్ డైరెక్టర్లు, ఖాతాదారులు, వాటాదారులు తదితరులు పాల్గొన్నారు.

26న జాబ్‌మేళా

కంచరపాలెం, జూలై 23 : కంచరపాలెంలోని జిల్లా ఉపాధికార్యాలయంలో ఈనెల 26వ తేదీన జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ఉపాధికల్పనాధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేళాలో నగరంలో నిఎనిమిది ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారన్నారు. పదో తరగతి, ఇంటర్,డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ తదితర కోర్సులు ఉత్తీర్ణులైన వారు హాజరుకావచ్చును. ఆసక్తి గల వారు నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్ నందు తమ వివరాలను ముందుగా నమోదు చేయాలని కోరారు.

నవోదయ విద్యాలయ కమిటీతో కలెక్టర్ సమావేశం

మహారాణిపేట, జూలై 23:కలెక్టరేట్‌లో జవహర్ నవోదయ విద్యాలయ యాజమాన్య కమిటీతో కలెక్టర్ ఎస్ఎం హరేంధిర ప్రసాద్ సమావేశమయ్యారు. పాఠశాలల కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్‌కు ప్రిన్సిపాల్ వైయస్ చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెం టేషన్ ద్వారా పాఠశాలలోని పలు విషయాలను వివరించారు. ఇటీవల పారా అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్ విభాగంలో విద్యాలయానికి చెందిన విద్యార్థిని తేజస్విని స్వర్ణ, రజత పతకాలు సాధించడంపై ఆమెను కలెక్టర్ అభినందించారు. మైగ్రేషన్ పథకం కింద మధ్య ప్రదేశ్‌నుంచి నవోదయ విద్యాలయానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. విద్యాలయ అభివృద్ధికి సహకారమందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో డీఈవో చంద్రకళ,విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్‌పాల్గొన్నారు.

జీవీఎంసీ నూతన కమిషనర్‌తో సమావేశం

జీవీఎంసీ నూతన కమిషనర్‌గా నియమితులైన పి. సంపత్‌కుమార్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చారు. అనంతరం సమావేశమై పలు అంశాలు చర్చించారు.

కొత్త ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో గరీబ్‌రథ్


బోగిలో సౌకర్యాలు

విశాఖపట్నం, జూలై 23: విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12739) మంగళవారం ఆధునిక కొత్త ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో విశాఖ నుంచి బయలుదేరి వెళ్లింది. ఐసీఎఫ్ రేక్ స్థానంలో 18 థర్డ్ ఏసీ ఎకానమీ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో అందుబాటులోకి వచ్చింది. ఈ రైలులో తరచూ రాకపోకలు సాగించే ప్రయాణికులు మంగళవారం మారిన కొత్త కోచ్‌లను చూసి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, సైడ్ విండో మిడిల్ బెర్తులను తొలగించడంపై హర్షం వ్యక్తంచేశారు. సౌకర్యంగా ఉన్న కోచ్‌ల్లో ప్రయాణం సాఫీగా సాగుతుందని అన్నారు.

ఎన్‌ఎస్‌టీఎల్ వ్యవస్థాపక వేడుకలు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ అబ్రహం వరుగీస్

గోపాలపట్నం, జూలై 23: ఎన్‌ఎస్‌టీఎల్ వ్యవస్థాపక వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌టీఎల్ స్థాపించి ఈ ఏడాదితో 55 ఏళ్లు పూర్తి కానున్నాయన్నారు. వ్యవస్థాపన వేడుకలను పురస్కరించుకుని సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌టీఎల్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్న పలు క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌టీఎల్ ప్రథమ మహిళ ఇలిన్ దీనా అబ్రహం, ఎన్‌ఎస్‌టీఎల్ వ్యవస్థాపన దినోత్సవ వేడుకల నిర్వహణ కమిటీ ఛైర్‌పర్సన్, సింటిస్ట్-జి జి.పలాక్షి, శాస్త్రవేత్తలు వైవీఎస్ చంద్రశేఖర్, సబ్యోతి వర్మ, కె.పిచ్చయ్య, అర్బన్‌కుమార్, డాక్టర్ హెచ్ఎన్ దాస్, డాక్టర్ రాధాకృష్ణ, ఎన్‌స్‌టీఎల్ వర్క్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన సచివాలయ ఉద్యోగులు


కమిషనర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న సచివాలయ ఉద్యోగులు

మహారాణిపేట, జూలై 23: జీవీఎంసీ నూతన కమిషనర్ సంపత్‌కుమార్‌ను గ్రామ వార్డు సచి వాలయ ఉద్యోగుల ఫెడరేషన్ సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జీవీ ఎంసీ ఎంప్లాయీస్ గౌరవ అధ్యక్షుడు ఆనందరావు ఆధ్వర్యంలో వెళ్లి కమిషనర్‌కు పుష్ప గుచ్ఛ మందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి. కిరణకుమార్, జిల్లా అధ్యక్షుడు జె. గణేష్‌కుమార్, బి.వి. అశోక్ కుమార్, పవన్‌కుమార్, చిం త కాయల బం గార్రాజు, జి. శ్యామలరావు సురేంద్ర, కర్రి రాజేష్, పి. నాగేశ్వరావు చంద్రబాబునాయుడు తదితరులున్నారు.

రైతుబజారులో అధికారుల తనిఖీ


కందిపప్పు తనిఖీ చేస్తున్న అధికారి ప్రవల్లిక

అక్కయ్యపాలెం, జూలై 23 : నరసింహనగర్ రైతుబజారులో వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు ఎస్‌కే యాసీన్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కా ర్యాలయంలో రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం సబ్సిడీ టమాటా విక్రయిస్తున్న డ్వాక్రా సభ్యులతో మాట్లాడారు. కందిపప్పు, రైస్ కౌంటర్‌ను పరిశీలించారు. అలాగే, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం కౌంటర్‌ను జిల్లా పౌరసరఫరా శాఖ క్వాలిటీ చెకింగ్ ఆఫీసర్ పి.ప్రవల్లిక తనిఖీ చేశారు. వీరితోపాటు రైతుబజారు ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ ఉన్నారు.

ఐపీమేట్‌లో 'థింక్‌ప్లస్' విద్యార్థుల ప్రతిభ

సీతంపేట, జూలై 23: ఇంటిగ్రేటెడ్ ప్రొగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ యాప్టిట్యూడ్ టెస్ట్ (ఐపీమేట్) ప్రవేశ పరీక్షల్లో అక్కయ్యపాలెంలో నరసింహనగర్‌లోని థింక్‌ప్లస్ విద్యా సంస్థ విద్యార్థులు ప్రతిభ కనపరిచి అర్హత సాధించినట్టు సంస్థ డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. గత మే, జూన్‌లలో నిర్వహించిన ఐపీమేట్ రొహటక్, ఐపీమేట్ ఇండోర్, జిప్‌మేట్ ప్రవేశ పరీక్షలో (బీబీఏ, ఎంబీఏ) ఐదేళ్ల ప్రొగ్రామ్‌లో పది మంది తమ విద్యార్థులు అర్హత సాధించారన్నారు. ఐఐఎం ఇండోర్‌లో వర్షిత్ సాయి సోమేష్, ఐఐఎం రొహటక్‌లో లికిత్ చరణ్, జాస్మిని, సిరి వర్షిణి, సాయిరాజ్, పవన్ ప్రతీక్, కుందన, ఐఐఎం జమ్ములో హసినీ, అన్విత, ఐఐఎం బోధగాయాలో అంకుర్ విద్యార్థులు అర్హత సాధించినట్టు పేర్కొన్నారు. వీరిని అభినందించారు.

జీవీఎంసీ కమిషనర్‌కు మేయర్ అభినందనలు


జీవీఎంసీ కమిషనర్‌గా నూతన బాధ్యతలుస్వీకరించిన సంపత్‌కుమార్‌ను అభినందిసున్న మేయర్ హరివెంకట కుమారి
-విశాఖపట్నం

ఈవీఎం గొడౌన్ల తనిఖీ


చినగదిలోని ఈవీఎంల తనిఖీలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నాయకులు

ఆరిలోవ, జూలై 23: చినగది మండల తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని ఈవీఎం గొడౌన్‌లను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా ఉదయం వివిధ పార్టీల నేతలు, స్థానిక అధికారులతో కలసి సందర్శించారు. పరిసరాలను, సీసీ కెమెరాల ఆయన పరిశీలించారు. భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అక్కడ లాగ్‌బుక్‌లో ఆయన సంతకం చేశారు. ఆయన వెంట నాయకులు అయిన ఒమ్మి పోలారావు, కె.వి. రమణ, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎలక్షన్ సెల్ అధికారులు, రెవెన్యు అధికారులు పాల్గొన్నారు.

'48వ వార్డు అభివృద్ధికి సహకరించండి'

కంచరపాలెం, జూలై 23 : జీవీఎంసీ 48వార్డు కొండవాలు గ్రామాలు అభివృద్ధికి తోడ్పాటును అందించాలని నూతనంగా గ్రేటర్ కమిషనర్ సంపత్ కుమార్‌ను కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు చేపట్టిన సంపత్ కుమార్‌ను అప్పారావు మర్యాద పూర్వకంగా కలిశారు. కొండవాలు గ్రామాల్లో రోడ్లు,డ్రైన్లు, రిటైనింగ్ వాల్స్, మెట్లు తదితర సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్టు వివరించారు.

నగలు పోయిన వారు సంప్రదించాలి: ఎస్ఐ

సీతంపేట, జూలై 23: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు నెలల క్రితం దొండపర్తికి చెందిన ఒక ఆటో డ్రైవర్ తనకు దొరికిందని బంగారు మండ చైన్, సాయిరామ్ పార్లర్ వద్ద మరొకరికి దొరికిన బంగారు గొలుసు పోలీసులకు అప్పగించారు. అయితే, ఈ ఆభరణాల కోసం ఎవరూ రాకపోవడంతో పాటు ఎటువంటి ఫిర్యాదులు నమోదు కాలేదని క్రైమ్ ఎస్ఐ భాస్కరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆభరణాలపై 106 బీఎన్‌ఎస్‌ఎస్ కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఆభరణాలు పోయిన వారు ఎవరైనా ఉంటే.. సరైన ధ్రువపత్రాలతో తమను సంప్రదించాలని కోరారు.

అభివృద్ధికి ఊతం

... 5వ పేజీ తరువాయి

కేంద్రం కొంత మేరకు సాయం అందిస్తోంది. కొత్తగా కేటాయించే నిధుల్లో విశాఖకు కూడా వాటా లభిస్తుంది. కొత్త ఆవిష్కరణలు జరగుతాయి.

▸▸ సముద్ర ఉత్పత్తుల ఎగుమతిలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే మొదటి స్థానంలో ఉంది. అందులో అత్యధిక శాతం విశాఖపట్నం పోర్టు నుంచే ఎగుమతి అవుతున్నాయి. వీటిని ఇంకా ప్రోత్సహించడానికి కేంద్రం రొయ్యల మేతకు దిగుమతి చేసుకునే వాటిపై సుంకం ఐదు శాతం తగ్గించింది.

▸▸ 25 రకాల ఖనిజాలపై కస్టమ్స్ డ్యూటీ ఎత్తేశారు. దాంతో ఆయా ఖనిజాల ఎగుమతి పెరగనుంది. అమ్మోనియం నైట్రేట్ విశాఖపట్నం పోర్టుకే ఎక్కువ దిగుమతి అవుతుంది. డొమెస్టిక్ పరిశ్రమను రక్షించడానికి సుంకం 7.5 శాతం నుంచి 10 శాతం పెంచారు. దీనివల్ల ప్రమాదకరమైన అమ్మోనియం నైట్రేట్ దిగుమతులు తగ్గనున్నాయి.

▸▸ పరిశ్రమల్లో మహిళలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించారు. దీనివల్ల పారిశ్రామిక సంస్థల్లో మహిళల సంఖ్య పెరగనుంది.

▸▸ విశాఖపట్నంలోని పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలకు కేటాయింపులు చేశారు. విశాఖపట్నం పోర్టుకు రూ.150 కోట్లు, హెచ్‌పీసీఎల్‌కు రూ.50 కోట్లు ఇచ్చారు.

▸▸ విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు మూలధన వ్యయం కింద రూ.620 కోట్లు సర్దుబాటు చేయనున్నారు.

పోలవరం పూర్తితో ఉత్తరాంధ్రాకు మేలు

పోలవరం పూర్తిచేసే బాధ్యత తీసుకుంటామని ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీనివల్ల ఉత్తరాంధ్రా జిల్లాలకు మేలు జరగనుంది. ఇక్కడి పరిశ్రమలకు అవసరమైన నీటితో పాటు సాగునీరు, నగర వాసుల తాగునీటి సమస్యలు తొలగిపోతాయి. అదేవిధంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి దోహదపడుతుంది.

దర్జాగా భూ కబ్జా

... 5వ పేజీ తరువాయి

చదునుచేస్తే ఎవరైనా అభ్యంతరం చెబుతారనే ఉద్దేశంతో అక్కడ ఒక అలయం పేరుతో చిన్నపాటి పర్ణశాలను నిర్మించారు. దానికి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తంకాకపోవడంతో ఆ స్థలాన్ని డెబ్రిస్‌తో చదునుచేసి, గ్యాస్ సిలెండర్లు లోడింగ్, అన్‌లోడింగ్ ప్రారంభించారు. ప్రభుత్వ స్థలం కావడంతో అక్కడ ఆక్రమణలను అడ్డుకునేందుకు స్థానిక రెవెన్యూ ఉద్యోగి ఒకరు కొద్దిరోజుల కిందట అక్కడకు వెళ్లారు. ఆక్రమణలపై ప్రశ్నించగా...స్థానికంగా ప్రజా ప్రతినిధిగా చెప్పుకుంటున్న నాయకుడి కుటుంబ సభ్యులు తనపై దాడి చేశారంటూ అతను పోలీసులకు ఫిర్యాదుచేశారు. తర్వాత కొద్దిరోజులపాటు ఆ స్థలంలో ఎలాంటి పనులు చేపట్టకుండా ఆగిపోయినప్పటికీ ఇటీవల మళ్లీ మొదలెట్టారు. ఈ విషయం చినగదిలి తహసీల్దార్ అధికారుల వద్ద ప్రస్తావించగా అది ప్రభుత్వ బంజరుభూమి అయినప్పటికీ డెయిరీ ఫారానికి కేటాయించామన్నారు. ఆక్రమణలను స్థానిక వీఆర్‌ఓ గుర్తించి తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. అయితే ఆ భూమి డెయిరీ ఫారానిది కావడంతో ఆక్రమణలకు సంబంధించిన సమాచారాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు. అయితే డెయిరీఫారం అధికారులు దీనిపై మిన్నకుండిపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ఆక్రమణదారులతో కుమ్మక్కైపోవడం వల్లే సర్వేనంబర్ 55లోని భూమి క్రమంగా అన్యాక్రాంతమైపోతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా డెయిరీ ఫారం అధికారులు స్పందించి విలువైన స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

బస్సులు సిద్ధం చేసుకుంటున్న ఆర్టీసీ

ద్వారకా బస్‌స్టేషన్, జూలై 22:

మహిళలకు ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించేందుకుబస్సులు సిద్ధం చేసుకున్నట్టు ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు ప్రకటించారు. కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా సమాయత్తమైనట్టు రీజనల్ మేనేజర్ అందవరపు అప్పలరాజు వెల్లడించారు. విశాఖ రీజియన్‌లోని మధురవాడ, వాల్తేరు, మద్దిలపాలెం, విశాఖపట్నం, గాజువాక, స్టీల్‌సిటీ, సింహాచలం డిపోల పరిధిలో ప్రస్తుతం 721 బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. ప్రతిరోజు 1.45 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిలో సగం మంది మహిళలు ఉంటున్నారు. అంటే సుమారు 72,500 మంది. ఉచిత రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తే మహిళా ప్రయాణికుల సంఖ్య మరో పది శాతం పెరిగి 79,750 చేరుకోవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. రీజియన్ పరిధిలో సిటీ ఆర్డినరీ, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో, జేఎన్ఎన్‌యూఆర్ఎం సర్వీస్‌లు 579 వరకూ ఉన్నాయి. ఈ సర్వీస్‌లలో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించే పరిస్థితి ఉంటే పీక్ సమయంలో అంటే ఉదయం 8.00 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 గంటల వరకు ఈ బస్సులన్నీ రద్దీగా మారే అవకాశం ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఆ రద్దీని తట్టుకునేందుకు ప్రతి డిపోలో ఉన్న రెండు స్పేర్ బస్సులను కూడా ఆ సమయాల్లో నడిపేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ ఏర్పాట్లుచేసుకుంటోంది.

త్వరలో మరో 33 బస్సులు

విశాఖ రీజియన్‌లో గతంలో 721 బస్సులు ఉండగా, ఇటీవల 12 కొత్త బస్సులు వచ్చాయి. మరో 33 కొత్త బస్సులు త్వరలో రానున్నాయి. బస్సుల సంఖ్య పెరగనున్నందున రద్దీ తక్కువగానే ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మహిళా ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైనన్ని బస్సులు అన్ని రూట్లలోను నడిపేందుకు తాము ప్రణాళిక, రూట్ మ్యాప్ సిద్ధం చేసుకున్నట్టు రీజనల్ అధికారులు వెల్లడించారు.

బడ్జెట్‌పై కూటమి శ్రేణుల హర్షం

సింహాచలం, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పలు కేటాయింపులు చేయడంపై కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వ పటిమకు నిదర్శనమని, రాష్ట్ర పురోభివృద్ధికి కేంద్రం మరింత చేయూత అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు, పంచదార్ల శ్రీనివాస్, జనసేన నేత మజ్జి సూరిబాబు, బీజేపీ నేత బసన అప్పలనాయుడు, తదితరులు బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి ప్రాధాన్యం

భీమునిపట్నం: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయించడంపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు హర్షం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలకు ఆర్థిక సాయం అందిస్తామని పేర్కొందన్నారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రలలో జిల్లాల అభివృద్ధికి సహకరిస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. నీరు, విద్యుత్, రైల్వే, రహదారుల నిర్మాణాలకు నిధులు ఇస్తారన్నారు.

సీఎం చంద్రబాబు సమర్థత

కొమ్మాది: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయింపుతో చంద్రబాబు సమర్థత నిరూపితమైందని టీడీపీ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్ అన్నారు. గత ప్రభుత్వంలో అసెంబ్లీలో బూతుపురాణాలు, దోచుకోవడం, దాచుకోవడం మాత్రమే చూశామన్నారు. ఇప్పుడు రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

రాష్ట్రానికి మంచి రోజులు

ఎంవీపీకాలనీ: కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి మంచిరోజులు వచ్చినట్టేనని తెలుగుశక్తి రాష్ట్ర అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. అమరావతికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15 వేల కోట్లు కేటాయించడంపై ఆయన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. పోలవరం ప్రాజెక్టు, పారిశ్రామిక ప్రగతికి, మౌలిక వసతుల కల్పనకు కేంద్రం చేయూతనందిస్తుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ ఏముఖం పెట్టుకుని ఢిల్లీ వెళ్లారని ఆయన ప్రశ్నించారు.

ముడసర్లోవ పార్కులో కూలిన చెట్లు



అశోక చెట్టు పడి ధ్వంసమైన షెల్టర్

ఆరిలోవ, జూలై 23: వర్షాలకు ముడసర్లోవపార్కులో పలు చెట్లు విరిగి పడిపోయాయి. ఓ చెట్టు పడడంతో షెల్టరు ధ్వంసమైంది. దీనిని అధికారులు తొలగించలేదు. ఇది అడ్డంగా ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పార్కుకు వచ్చే వారినుంచి టిక్కెట్ వసూలుపై చూపే శ్రద్ధ చెట్టు తొలగింపులో చూపడంలేదనే విమర్శలు తలెత్తుతున్నాయి.

ఆర్టీసీ కార్మికులకు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలు పొందిన కార్మికులతో డిపో అధికారులు

సింహాచలం, జూలై 23: సింహగిరి ప్రదక్షిణ ఉత్సవంలో భక్తులకు మెరుగైన సేవలను అందించి సింహాచలం ఆర్టీసీ డిపోనకు రికార్డు స్థాయిలో ఆదాయాన్ని సమకూర్చిన పన్నెండు మంది కార్మికులకు డిపో మేనేజర్ రాజశేఖర్ మంగళవారం ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అత్యధికం ఆదాయం తీసుకువచ్చిన అరుబస్సుల డ్రైవర్లు సీహెచ్ నాయుడు, పీటీపీ రావు, కె.రమణ, జీఎస్ రావు, ఎంఎన్ రాజు, ఎస్టీరావులతో పాటు కండక్టర్లు సీహెచ్‌వీ లక్ష్మి, సీహెచ్ సత్యవతి, బి.రమేష్, టీవీజీఎస్ రావు, ఎంఎం రాము, కేఎస్ బాబులకు నగదు ప్రోత్సాహకాలను అందజేసి అభినందించారు.

సినిమా గైడ్

● **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)

● **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),

● **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),

● **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 61, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 10, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 34, ఆనపకాయ 6, కాలీఫ్లవర్ 42, క్యాబేజి 32, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 33, అరటికాయ (పెద్దది) 6, మునక్కాడలు (కిలో) 100, అల్లం 145, బరబాటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 80, గోరు చిక్కుడు 40, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 40, కీరదోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 62, దేముడు చిక్కుడు 82, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి కిలో 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 92
ఫారం ధర	-- 112
విత్ స్కిన్	-- 194
స్కిన్‌లెస్	-- 204

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..

వృథాగా గిరిజన పాఠశాల భవనాలు

» వైసీపీ సర్కారు నిర్లక్ష్యంతో నిలిచిన పనులు



బాలికల పాఠశాలకు నిర్మించిన భవనం



బాలుర పాఠశాలకు కొత్తగా నిర్మించిన భవనం

కొమ్మాది, జూలై 23: గిరిజన విద్యార్థుల కోసం రూ.కోట్లు ఖర్చు చేసిన నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి.మదురవాడ సమీపంలోని మారికవలస వద్ద బాల బాలికలకు వేర్వేరుగా గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలున్నాయి. ప్రతి విద్యాసంవత్సరంలో ప్రవేశ పరీక్ష నిర్వహించి ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తుంటారు. కాగా విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పనలో భాగంగా అప్పటి గిరిజన విద్యాలయాల పీవో రెండు పాఠశాలలకు విశాలమైన తరగతి గదులు, ప్రత్యేకంగా ల్యాబ్, ఉపాధ్యాయులు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన వసతులతో భవనాలను నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ మేరకు నిధులు విడుదల కావడంతో భవనాలను సర్వాంగ సుందరంగా నిర్మించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావడంలో నిర్లక్ష్యం వహించింది. చివరి దశ నిధులు విడుదల చేయకుండా అడ్డుకోవడంతో కొన్ని పనులు నిలిచిపోయాయి. బిల్లులు అందకపోవడంతో ఈ భవన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టరు కూడా వీటివైపు కన్నెత్తి చూడడం లేదని తెలిసింది. మారికవలస ఐటీ హిల్స్ రోడ్డులో కొండవాలును ఆనుకుని భవనం నిర్మించడంతో వర్షాలు కురిసిన సమయంలో కొండలపై నుంచి వచ్చే నీరంతా కొత్త భవనంలోకి చేరే ప్రమాదం ఏర్పడింది. దీనిని అధిగమించేందుకు ప్రహరీ, నీరు ఎప్పటికప్పుడు దిగువకు వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థలను నిర్మించాల్సి ఉంది. అయితే నిధులు విడుదల కాక, చేసిన పనులకు బిల్లులూ అందక కాంట్రాక్టరు పనులు వదిలేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో భవనాలకు మోక్షం లభిస్తుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భావిస్తున్నారు.

బీఆర్‌టీఎస్ పనులతో నివాసితులకు ఇక్కట్లు

» ఇళ్ల కింద మట్టి జారిపోవడంతో గగ్గోలు

» కూలిపోకముందే చర్యలు తీసుకోవాలని వినతి



మట్టి జారిపోవడంతో ప్రమాదంలో ఓ ఇల్లు

సింహాచలం, జూలై 23: మహావిశాఖ 98వ వార్డులోని పాతగోశాల నుండి పాతఅడివివరం కూడలి వరకు జీవీఎంసీ చేపడుతున్న బీఆర్‌టీస్ కారిడార్ నిర్మాణానికి అనుకుని ఉన్న ఇళ్లకు పెనుప్రమాదం పొంచి ఉందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. కారిడార్ పనులు ప్రారంభం నుంచి నిర్వాసితులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తొలుత రాత్రికిరాత్రే పోలీసు బలగాలు, యంత్రాలతో వచ్చి ఇళ్లలోని వారిని రోడ్డున పడేసి నివాసాలు కూల్చడంతో సమస్యలు ప్రారంభమయ్యాయి. తరువాత టీడీఆర్ వ్యత్యాసాలు, నష్టపరిహారాల లెక్కల్లో తేడాలు పరిష్కరించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. తాజాగా రోడ్డుకు అనుకుని ఉన్న కాపువీధి, కుమ్మరివీధి ఇళ్ల పునాదు కిందనున్న మట్టి వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో ఇళ్లు గాలిలో వేలాడుతున్నాయి. ఇవి ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదం ఉందని వారంతా ఆందోళన చెందుతున్నారు. యంత్రాలతో తొలిచిన వెంటనే రిటైనింగ్ వాల్స్ నిర్మించి రక్షణ కలిపించాల్సిన అధికారులు ఆ విషయాన్ని విస్మరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

సమస్యల రహితంగా ఏయూను తీర్చిదిద్దుతా

» ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, జూలై 23: సమస్యల రహితంగా ఏయూను తీర్చిదిద్దుతానని ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. మంగళవారం ఏయూ సైన్స్, ఫార్మసీ, న్యాయ కళాశాలల పరిధిలో బోధన, బోధనేతర సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కళాశాలల్లో విద్యా సంబంధ కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. వర్సిటీ అభివృద్ధిలో బోధన, బోధనేతర సిబ్బంది పాత్ర ఎంతో కీలకమన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు విభాగాధిపతులు, ప్రిన్సిపాల్స్ తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. హాస్టల్స్ నిర్వహణ, భోజన నాణ్యత, వసతి కల్పనను వార్డెన్‌లు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పర్యవేక్షించాలన్నారు. సక్రమంగా తరగతులను నిర్వహించాలని, అకడమిక్ క్యాలెండర్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. రీసెర్చ్ ప్రాజెక్టులకు దరఖాస్తు చేయాలన్నారు. సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ఐఎస్ఓ ఆడిట్‌కు సహకారం అందించాలని విభాగాధిపతులకు సూచించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, కె.సీతామాణిక్యం, జి.గిరిజా శంకర్, విభాగాధిపతులు, బీఓఎస్ ఛైర్మన్లు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమానికి ప్రోత్సాహం: కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పెందుర్తి, జూలై 23: మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సాహన్ని అందిస్తుందని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. పెందుర్తిలోని జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో మంగళవారం గ్రామీణ మండలాల జిల్లా సమాఖ్య సభ్యులకు మహిళా సాధికారిత, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారిత ప్రభుత్వ పథకాల పట్ల అవగాహనతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ క్రమంలో సభ్యులు ఆరోగ్యం, పిల్లలు విద్యపై దృష్టి సారించాలన్నారు. కుటుంబ జీవన ప్రమాణం మెరుగు కోసం ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాల పట్ల అవగాహనను పెంచుకోవాలని పేర్కొన్నారు. లింగ వివక్ష, బాల్య వివాహాల నియంత్రణ, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సదస్సులో చర్చించిన అంశాలు, నేర్చుకున్న విషయాలను గ్రామ సభ్యులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం నల్ జల్ మిత్ర శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా ప్రగతి కార్యక్రమాలకు సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్‌ను హరేంధిర ప్రసాద్ తిలకించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి పథకాల సంచాలకులు, ఎంఎస్ఎంఈ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

సింహాచలేశుడికి వైభవంగా ఆర్జిత సేవలు



కల్యాణం చేస్తున్న అర్చకులు



గరుడోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం, జూలై 23: వరాహలక్ష్మీనృసింహస్వామికి మంగళవారం సుప్రభాతసేవ, గరుడసేవ, నిత్యకల్యాణం వంటి పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి సేవాకాలం, ధూపసేవ, నిత్యహోమాలు, బాలభోగనివేదనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించిన విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు జరిపి జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణ గావించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాల అనంతరం భక్తులకు వేదాశీర్వచనం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడవాహనంపై అధిష్ఠింపజేసి గరుడ సేవ నిర్వహించారు. ప్రత్యేక శీతలం (పంచదార) నివేదించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలోనిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని లలితానగర్ ప్రాంతవాసి వారణాసి మణికంఠకుమారి రూ.లక్ష విరాళంగా సమర్పించారు. మంగళవారం ప్రజాసంబంధాల అధికారి డి.అప్పలనాయుడుకు నగదు రూపంలో అందజేశారు. దాతకు అంతరాలయం దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలను, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

జీవీఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ల అభినందనలు

కొమ్మాది, జూలై 23: గ్రేటర్ 5వవార్డు పరిధిలోని కొండవాలు ప్రాంతంలోని సమస్యల పరిష్కరించాలని కార్పొరేటర్ మొల్లిహేమలత జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌ను కలిసి కోరారు. మంగళవారం ఆమె నూతన బాధ్యతలు స్వీకరించిన కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వార్డులోని కొండవాలు ప్రాంతంలోని తాగునీటి, రాజీవ్‌గృహ కల్ప కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.





జీవీఎంసీ కమిషనర్‌తో ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 18వ వార్డు కార్పొరేటర్ మంగవేణి

ఎం.వి.పి.కాలనీ: జీవీఎంసీ సంపత్ కుమార్‌ను 18 వార్డు టీడీపీ కార్పొరేటరు గొలగాని మంగవేణి మర్యాదపూర్వకంగా కలిశారు. వార్డులో పర్యటించి, స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆమె కోరారు. త్వరలోనే పర్యటిస్తానని కమిషనర్ తెలిపారు.

ఆరిలోవ: జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ను జీవీఎంసీ జీ ఫ్లోర్ లీడర్ పీలాశ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ కార్పొరేటర్ల బృందం వెళ్లి కలిసింది. పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 10, 18, 19 వ వార్డుల కార్పొరేటర్లు మద్దిల రామలక్ష్మి, మంగవేణి, నొల్లి నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భూలోకమాత అనుపోత్సవం



ఆలయంలోని తొలిపూజ నిర్వహిస్తున్న గ్రామస్థులు



ఘటాలను ఊరేగిస్తున్న గ్రామ సంఘం సభ్యులు

వెంకోజిపాలెం, జూలై 23: కొత్తవెంకోజీపాలెం గ్రామ ఇలవేల్పు శ్రీ భూలోకమాత అనుపోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులను సమర్పించారు. ఘటాలతో మొక్కులను చెల్లించారు. అర్చకులు సాయి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్ రుద్ర, సెంచూరియన్ వర్సిటీ వీసీ జి.ఎస్.ఎన్.రాజు దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని గ్రామ సేవా సంఘం నాయకులు సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. సాయంత్రం పరస ఉత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని పాతవెంకోజీపాలెంలోని కనకమ్మ ఆలయానికి తీసుకువెళ్లి అక్కడ పసుపు, కుంకుమ సమర్పించి తిరిగి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షులు కనకరాజుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు, మాజీ అధ్యక్షులు మద్దాల వీర వెంకట అప్పా రావు, బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, ఆడారి కామేశ్వరరావు, ఆడారి శ్రీనివాస్, మద్దాల భాను, పీల జోష్యుల, ఎస్.నరసింహారెడ్డి, ఎర్రాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం, మత్తు పదార్థాలను అరికట్టాలి



కృష్ణకళాశాల వద్ద నిరసన తెలుపుతన్న పీడీఎస్‌వో కార్యకర్తలు

మద్దిలపాలెం, జూలై 23: మద్యం, మత్తు పదార్థాలను పక్కా నిషేధించాలని పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి డిమాండ్ చేశారు. డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గేటు ఎదుట మంగళవారం మద్యం మత్తు పదార్థాలు అరికట్టాలని డిమాండ్ చేస్తు పీడీఎస్‌వో కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్న వారిలో అత్యధికంగా మద్యం, మత్తు పదార్థాలకు బానిసలైన మైనర్లు, యువతే ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. నేరాలు జరిగిన సమయంలో ప్రభుత్వం కంటితుడుపు చర్యలు తప్ప పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకులు నాగశ్రీ, మన్మధరావు, లోకేష్, ఆనంద్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధ్యాపకులు

మద్దిలపాలెం, జూలై 23: డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు మంగళవారం స్పెషల్ కేటగిరి అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్, క్యాప్, ఎక్స్‌ట్రా కర్యుకులర్ అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాలకు చెందిన విద్యార్థులు 24, 25వ తేదీల్లో కళాశాలలో తమ ధ్రువపత్రాలు పరిశీలన చేసుకోవాలని సూచించారు.

డయాబెటిక్ రెటినోపతిపై అప్రమత్తత అవసరం

ఆరిలోవ, జూలై 23: డయాబెటిక్ రెటినోపతి అనే కళ్లను ప్రభావితం చేసే వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని రెటనో స్పెషలిస్ట్ డాక్టర్ రుత్విజ్ పాండ్యా పేర్కొన్నారు. ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వ్యాధికి సకాలంలో చికిత్స అందించకుంటే దృష్టిని కోల్పోవచ్చని హెచ్చరించారు. రక్తంలో చక్కెర స్థాయి ఎక్కువ కావడంతో రెటీనాలో రక్తనాళాలల దెబ్బతిని కాంతిని గ్రహించే శక్తిని కోల్పోతాయన్నారు. అందువల్ల మధుమేహ వ్యాధితో బాధపడుతున్న వారు ప్రతి ఆరు నెలలకోసారి కళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. మధుమేహం, రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలని సూచించారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన

భీమునిపట్నం (రూరల్), జూలై 23: విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం మండలంలోని చిప్పాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ని విద్యార్థులకు అవగాహన కలిగించారు. నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భూకంపాలు, తుఫాన్‌లు వచ్చే సమయంలో జాగ్రత్తలపై వివిధ రకాల పరికరాలను ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. సంస్థ ప్రాంతీయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.టి.వి, రత్నం, ఉపాధ్యాయులు ఆర్.అప్పారావు, హేమసుందరరావు, గ్రామస్థుడు సరగడ అప్పారావు రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి: సీఐ



యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ

ఆరిలోవ, జూలై 23: వ్యసనాలకు దూరంగా యువత సన్మార్గంలో నడపాలని ఆరిలోవ సీఐ గోవిందరావు సూచించారు. పలు జంక్షన్లలో యువతతో మాట్లాడి అవగాహన కల్పించారు. యువత మద్యం, గంజాయి, డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఈ సందర్భంగా విచ్చలవిడిగా గంజాయి లభ్యంకావడంతో వ్యసనానికి బానిసలుగా మారుతున్నట్టు పలువురు యువకులు అభి ప్రాయపడ్డారు. సీఐ సైబర్‌నేరాలపై పలు సూచనలందించారు. సులువుగా డబ్బు సంపాదన కోసం సైబర్ నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి వాటికి దూరంగా ఉంటూ చదువుపై దృష్టి కేంద్రీకరించాలని సీఐ సూచించారు. జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. పలువురు పోలీసులు పాల్గొన్నారు.

నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



అనంతవరంలో వరి నారుమళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పద్మనాభం, జూలై 23: నారుమడుల సస్య రక్షణకు చర్యలు తీసుకోవాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని అనంతవరంలో ఖరీఫ్ నారుమళ్లను మంగళవారం పరిశీలించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎటువంటి ఇబ్బంది లేదని రైతులకు తెలిపారు. నారుమడి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నారుమడుల్లో ఐదురోజులకుపైగా నీరు ఉంటే తొలగించి 5సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ కలిపి వేయాలన్నారు. దీంతో పాటు ఒక గ్రాము కార్బండిజం మందును లీటరు నీటిలో కలిపి చల్లాలన్నారు. నారు ఎరుపురంగులో ఉండి పసుపు ఆకులు ఎక్కువగా కనిపిస్తే 2 గ్రాముల జింక్ సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వారం రోజులలో నారు తీస్తారనగా, 5సెంట్ల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ వాసనరాని గుళికలను వేయాలన్నారు. దీని వల్ల నాట్లు వేసిన తరువాత నెల రోజుల వరకు పీకపురుగు, ఆకుముడత వంటి చీడపీడలు పంటను ఆశించవన్నారు. ఎరువుల యాజమాన్య పద్ధతులు, కలుపు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్తలు విశాలాక్షి, పద్మావతి, భీమిలి డివిజన్ వ్యవసాయశాఖ ఏడీ విజయప్రసాద్, జిల్లా వనరుల కేంద్రం ఏడీ సుబ్రహ్మణ్యం, ఏఓ ఎంవీఎస్ చలం, టెక్నికల్ వ్యవసాయాధికారి శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు శిరీష తదితరులు పాల్గొన్నారు.